VISALAANDHRA VIJAYAWADA; PHONE: No. 376

6 పేజీలు 6 నయాపైసలు రిజిష్టర్డు నెం. A-193

706216

విశాలాంధ్ర

సంపుటి 9] విజయవాడ * 27 మే 1960 * శుక్రవారం [సంచిక 59

భిలాయ్ ఉక్కు ఫ్యాక్టరీలో
25 [illegible] రాగి దొంగతనం

రాయపూర్, మే 26

భిలాయ్ ఉక్కు ఫ్యాక్టరీనుండి దొంగతనం చేశారని అనుమానించబడుతున్న 25 వేలరూపాయల రాగి తీగను భిలాయ్ ఫ్యాక్టరీ పని వారినుండీ, ఒక స్థానిక వ్యాపారినుండీ నేను పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. ఈ సందర్భంలో పదిమందిని పోలీసులు అరెస్టు చేశారు.

బ్రహ్మాండమైన 4 పోటీ కుస్తీలు
29-5-60 ఆదివారం సా॥ 6-30 గం॥లకు ప్రతి ఆదివారం జరుగును
రైల్వే రెటైరింగ్ షెడ్ వద్ద [illegible] విజయవాడలో
ఎస్. కాంతారావు (నెల్లూరు) [illegible] (నాగపూర్)
సైదా రాములు (విజయవాడ) [illegible] నారాయణ ([illegible])
పెదపూడి వెంకటేశ్వర్లు విజయవాడ [illegible] (ఏలూరు)
వెన్నపూడి కృష్ణ (విజయవాడ) [illegible] (విజయవాడ)
రేట్లు: 1-8-0, 1-0-0, 0-10-0
ఆర్గనైజరు: కె. వి. రమణ

దేశమంతటా లక్షలాది కేంద్ర ప్రభుత్వోద్యోగుల ప్రదర్శనలు
కోర్కెలదిన సందర్భంలో సర్వత్రా వేలాది ప్రజల అసమ్మతి సభలు, ఊరేగింపులు

తమ డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే సంప్రతింపులు జరపాలని తీర్మానాలు

విజయవాడ, మే 26

లక్షలాది కేంద్రప్రభుత్వోద్యోగులు నేడు దేశమంతటా "కోర్కెలదినం" జరిపారు. ఈ సందర్భంలో ఉద్యోగులు ప్రధానమయిన పట్టణాల్లో ప్రదర్శనలు, ఊరేగింపులు, సభలు జరిపి సంయుక్తకార్యాచరణసమితి వెల్లడించిన ఆరు ప్రధాన కోర్కెలపైనా కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉద్యోగులతో సంప్రతింపులు ప్రారంభించాలని చాటారు.

రైల్వేశాఖ, ఆదాయపన్నుశాఖ, పౌర విమానశాఖ, తంతితపాలాశాఖ, రక్షణ శాఖ మొదలుగాగల కేంద్ర ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులంతా పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వోద్యోగులకు దేశమంతటా ఒక కనీస వేతనం నిర్ణయించడం, ప్రస్తుతం వారికున్న హక్కులను, సౌకర్యాలను రద్దుచేయకుండా వుండడం మొదలగు కోర్కెలపై వారు ఆందోళన చేస్తున్న విషయం పాఠకులకు విదితమే.

సంయుక్త కార్యాచరణ సమితి అధ్యక్షుడు శ్రీ వి. జి. దాల్వీ సమితి ఈ మొదట బొంబాయిలో సమావేశమై తమ కోర్కెలను సాధించడానికి ఉద్యోగు లనుసరించవలసిన ప్రత్యేక చర్యలనుగూర్చి ఆలోచిస్తుందని ప్రకటించారు. ఈ సమితి 22 లక్షలమంది ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తున్నది.

బొంబాయిలో కేంద్ర ప్రభుత్వోద్యోగులు జరిపిన ఒక బ్రహ్మాండమైన సభలో శ్రీ దాల్వీ ప్రసంగిస్తూ, ఈ వివాదంలో ప్రధాని నెహ్రూ జోక్యం కల్పించుకోవాలని తాము కోరామని, ఆయన విదేశాలనుండి తిరిగి వచ్చాక, సమితి ప్రతినిధులను కలుసుకొని సంభాషణలు జరపగలరని తాను ఆశిస్తున్నాననీ అన్నారు.

ఢిల్లీలో

భారత రాజధానిలో జరిగిన కేంద్ర ప్రభుత్వోద్యోగుల సభ క్రింది తీర్మానం ఆమోదించింది. ప్రభుత్వం పరిస్థితి ఎంత తీవ్రంగా ఉన్నదో గుర్తించి సంయుక్త కార్యాచరణ సమితితో చర్చలు ప్రారంభించాలని, ఉద్యోగులు ప్రత్యక్ష చర్యకు దిగే ప్రమేయం లేకుండా చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

మద్రాసులో

మద్రాసులో కేంద్ర ప్రభుత్వోద్యోగులు వీధుల్లో పెద్ద ఊరేగింపు జరిపారు. మొదటి వేతనాల సంఘం సిఫార్సుచేసిన చొప్పున కరువు భత్యం ఇవ్వాలనీ, దేశమంతటా వర్తించే కనీస వేతనం నిర్ణయించాలనీ నినాదాలిచ్చారు. తరువాత జరిగిన సభలో నగరంలోని వివిధ కార్మిక సంఘాల నాయకులూ, కేంద్రప్రభుత్వోద్యోగుల నాయకులూ వివిధ రాజకీయ పార్టీల నాయకులూ ప్రసంగించారు.

జంట నగరాలలో

హైదరాబాదు, సికింద్రాబాదు నగరాల్లో కేంద్ర ప్రభుత్వోద్యోగులు కోర్కెలదినం జరిపారు. ఈ సందర్భంలో ఆబిడ్ రోడ్డువద్ద ఆర్. యం.

(మిగతా 6వ పేజీలో)

అమెరికా విమానవాహక నౌకకు పెద్దనష్టం

వాషింగ్టన్, మే 25

ప్రపంచానికంతకు పెద్దదైన 60 వేల టన్నుల ప్రమాణంగల అమెరికా విమాన వాహకనౌక "సారటోగా" గతరాత్రి కేప్ హెన్రీకి 200 మైళ్ళ దూరంలో ఒక జర్మన్ నౌకను ఢీకొనడం వలన పూర్తిగా పాడైపోయింది. ఈ విమాన వాహకనౌక 100 జెట్ విమానాలను తీసుకొని పోగలదు.

ఈ నౌకను నిర్మించి అయిదుసంవత్సరాలుకూడా కాలేదు. జర్మన్ నౌక ప్రమాణం 6135 టన్నులు. ఈ నౌక కూడా దెబ్బతిందిగాని స్వయంగా ప్రయాణించి బాల్టిమోర్ రేవు వరకు చేరింది.

ఢీకొన్న వెంటనే "సారటోగా"లో మంటలు లేచాయి. కాని వాటిని వెంటనే ఆర్పివేశారు. ఎవరైనా మరణించిందీ లేనిదీ తెలియలేదు. సారటోగాకు దెబ్బతగలగానే లోపల ఇంధనం సరఫరా గొట్టాలు దెబ్బతిని మంటలు లేచాయి. జర్మన్ నౌకలో నివసించే గదులు, ఓడ పైభాగం మొదలైనవి దెబ్బతిన్నాయి. ఇది ఒక వ్యాపారనౌక.

* * *

చంబల్ లోయ ప్రాంతంలో ఆచార్య వినోబా సాగిస్తున్న శాంతి యాత్రకు రాష్ట్రపతి తన అభినందనలను పంపించారు.

రష్యా ఫిర్యాదుపై భద్రతాసంఘం చర్చ

సోవియట్ తన ఫిర్యాదులనుగూర్చి పట్టుపట్టరాదని కొంతమంది సూచన

ఐరాస, మే 25

సోవియట్ భూభాగంపైన, యితర దేశాల భూభాగాలపైన అమెరికా వైమానిక గూఢచారిచర్యలను ఖండించవలసిందిగా కోరుతూ సోవియట్ యూనియన్ ప్రవేశపెట్టిన తీర్మానంపై భద్రతా సంఘం తిరిగి నేడు చర్చను ప్రారంభించింది. ఈ సందర్భంలో సింహళ ప్రతినిధి, ఈనెల భద్రతా సంఘ అధ్యక్షుడు అయిన సర్ క్లాడ్ కొరియా మాట్లాడుతూ మే 1 నాటి యు-2 గూఢచారి విమానోదంతం గూర్చిన చర్యలను ఖండిస్తూ కోరిన వరకులను సోవియట్ వదలుకోవాలని అన్నారు

ఇకమీదట అటువంటి సైనిక గూఢచారి చర్యలకు పూనుకోబోమని అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ యిచ్చిన హామీలను అంగీకరించవలసిందిగా, సర్ క్లాడ్ సోవియట్ విదేశాంగమంత్రి గ్రోమికోకు విజ్ఞప్తి చేశారు.

భద్రతాసంఘం సోవియట్ ఫిర్యాదుపై మూడవరోజు చర్చ జరిపింది. చర్చ పూర్తయింది. ఈసందర్భంలో సింహళ ప్రతినిధి పై విజ్ఞప్తి చేశారు.

ఆయన యింకా యిలా అన్నారు: అగ్రరాజ్యాల మధ్య సత్సంబంధాలు ఏర్పడి అభివృద్ధిగావడం ఎంతో అవసరం. అందుచేత ఇందుకు ప్రారంభం ఇప్పుడే కావాలి. నెలలుగడిస్తే లాభంలేదు. ఈ విషయంలో జాప్యానికి మనం తావీయరాదు. ఇప్పుడే పని జరగాలి. మేము పైన ఉదహరించిన హామీ ఒక ప్రక్క వుండగా (ఐసెన్‌హోవర్ తాత్కాలిక హామీ-సం॥) మరోప్రక్క అమెరికా చర్యను ఖండించడానికి పూనుకుంటే అగ్ర రాజ్యాలమధ్య సత్సంబంధాలేర్పడ్డం ఎలా?

[illegible] ట్యునీషియా ప్రతినిధి

(మిగతా 2వ పేజీలో)

మత వైషమ్యాలను రెచ్చగొట్టే చర్యలు

అకాలీలను అరెస్టుచేసే పంజాబుప్రభుత్వ విధానంపై కమ్యూనిస్ట్‌నాయకుని విమర్శ

జలంధర్, మే 25

మాస్టర్ తారాసింగ్, తదితర అకాలీ నాయకులను అరెస్టుచేస్తున్న పంజాబు ప్రభుత్వ విధానాన్ని పంజాబు కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ హరికిషన్‌సింగ్ సూర్జిత్ నిశితంగా ఖండించారు.

శ్రీ హరి కిషన్ సింగ్ సూర్జిత్ నేడొక పత్రికా ప్రకటనలో యిలా అన్నారు:

పంజాబీ సుభా కోసం జరుగుతున్న ఆందోళనను అణచివేసే పేరుతో అకాలీ నాయకులను అరెస్టు చేయడం కక్షింపు చర్య తప్ప మరొకటి కాదు. గతంలో కూడా పంజాబు ప్రభుత్వం ఇలాంటి కక్షింపు చర్యల ద్వారా రాష్ట్రంలో మతవైషమ్యాలను తీవ్రతరం చేసింది. అందువలన వెంటనే నిర్బంధ విధాన చర్యలను ఆపివేసి మాస్టర్ తారాసింగ్‌తోసహా అరెస్టు చేయబడిన అకాలీలందరినీ విడుదల చేయవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

వీరేశలింగం వర్ధంతి ప్రత్యేకానుబంధం
(మూడు, నాల్గు పేజీలలో)

ఆంధ్రప్రదేశ్ అంతటా అన్నిముఖ్యకేంద్రాలలో
నేడే చూడండి!
పసందైన పాటలు భేషైన నృత్యాలతో చూచినకొద్దీ చూడాలనిపించే
జనరంజకమైన జానపదచిత్రం
బి.ఏ.యస్ వారి.....
రాణీ రత్నప్రభ
నిర్మాత-దర్శకుడు: బి.ఏ.సుబ్బారావు
సంగీతం: యస్.రాజేశ్వరరావు
తారాగణం..........అంజలీదేవి · యస్.టి.రామారావు
రేలంగి · గుమ్మడి · సి.యస్.ఆర్ · సంధ్య · సురభిబాలసరస్వతి · రాధిక · కోటేశ్వరరావు · బాలకృష్ణ · సీతారాం & నల్లరామమూర్తి.......
శ్రీ ఫిలిమ్స్ రిలీజ్
కథ: సదాశివబ్రహ్మం · మాటలు: సదాశివబ్రహ్మం & పి.ఆర్.కౌండిన్య · పాటలు: ఆరుద్ర & కొసరాజు · కళ: వాలి · కెమెరా: సి.నాగేశ్వరరావు · నృత్యం: వి.జె.శర్మ · ఎడిటింగ్: కె.ఏ.మార్తాండ్ · అసోసియేట్ డైరెక్టర్: కె.వి.కుటుంబరావు

శార్వరినామ సంవత్సర
జ్యేష్ఠ శు॥ విదియ రా. 7-40
మృగశిర రా. 7-30

విశాలాంధ్ర
శుక్రవారం 27-5-1960

జోహార్లు

అది 1919 మే 27 వ తేదీ. నవయుగ వైతాళికుడు, సంఘసంస్కర్త, కార్యశూరుడు, వచన రచనా పితామహుడు, శతాధిక గ్రంథకర్త, మహాకవి కందుకూరి వీరేశలింగంగారు 71 సంవత్సరాల వయసులో విగతజీవులైన నేటికి 41 సంవత్సరాలయింది.

నేడు వారి భౌతికకాయం మన కట్టెదుట కానరాక పోయినా, అకుంఠిత వజ్ర సంకల్పంతో ఆయన ఆంధ్రప్రజల సాంఘిక జీవితంలో తెచ్చిన విప్లవం మాత్రం తెలుగుజాతి కళ్ళల్లో దివ్యజ్యోతిలా వెలుగొందుతూనే ఉన్నది.

దురాచార దుర్వర్తనాలను రూపుమాపడానికీ, అభ్యుదయ మార్గాన దేశాన్ని పురోగమింప జేయడానికీ బహుముఖంగా ఆయన సలిపిన కృషి అద్వితీయమైనది.

మూఢవిశ్వాసాలూ, దురాచారాలూ సంఘానికి రాచపుండులవంటివని ఆయన నమ్మిక. వాటిని సిల్కుబట్టలతో కప్పి ప్రయోజనం లేదనీ, కత్తిపుచ్చుకొని శస్త్రం చేయాలనీ ఆయన పట్టుదల.

ఆదీక్షతో ఆయన వాటిపై దాడి సలిపాడు. దయ్యాలూ, భూతాలూ లేవన్నాడు. మంత్రవేత్తల కుతంత్రాలన్నీ బట్టబయలు చేశాడు. ముహూర్తాలూ, శకునాలూ బూటకమన్నాడు. 'దేవుడుచేసిన రోజులన్నీ మంచివే'నని తాను అమావాస్యనాడు ప్రయాణం చేశాడు. బాల్య వివాహాలూ, కన్యాశుల్కాలూ పనికిరావన్నాడు. వితంతు వివాహాలను ప్రోత్సహించాడు. వేశ్యాలోలత్వాన్ని ఎదిరించాడు. లంచగొండితనంపై కత్తికట్టాడు. కులమత విభేదాలను దుయ్యబట్టాడు. అస్పృశ్యతను పారద్రోలాడు. స్త్రీ విద్యను వ్యాప్తి పొందించాడు.

ఈ మహోద్యమం కోసం వితంతు శరణాలయాలూ అనాథ మందిరాలూ విద్యాలయాలూ స్థాపించాడు. వివేకవర్ధని, హాస్య సంజీవిని వంటి పత్రికలు నడిపాడు. పండితులకూ, పామరులకూ ఉపయోగపడేట్లు అనేక గ్రంథాలు రచించాడు.

"తానుపదేశించిన దానిని నడిపించి చూపవలెగాని, కేవల సుదీర్ఘోపన్యాసముల వలనను, పుస్తక ప్రకటనముల వలనను కార్యముండదని" ఆయనభావన.

"లంచములు తగవన్న, రాజకీయోద్యోగులకు కోపము. వేశ్యాంగనా సంగమము నీతిగాదన్న శృంగార నాయకులకు కోపము. పూర్వాచారము మార్చుకోవలెనన్న పామర జనులకు కోపము. నీతిమాలిన బాహ్యవేషములు మతవిరుద్ధములన్న ఆచార్య పురుషులకు కోపము. మా ఉద్దేశమును నిశ్చితముగా నిర్వహింపవలసినచో ఇన్ని కోపములను సరకు చేయకుండవలెను" అని ఆయన వ్రాశారు.

అలాగే ఎందరెదిరిస్తున్నా, ఎన్ని అవాంతరాలు సంఘటిస్తున్నా, ఎంత కష్టపడవలసి వచ్చినా, సంఘ శ్రేయస్సే సంస్కర్తగా ప్రతిన తాను ఆచరించి చూపాడు. కార్యదక్షత్వంతో సంఘాన్ని సంస్కరణోన్ముఖం చేశాడు.

ఈ మహత్తర సాంఘిక విప్లవంతోపాటు భాషావిప్లవం కూడా కొనసాగించి ఆయన ఆంధ్రభాషకు చేసిన సేవ అపారం. 'ఒకరి అభిప్రాయముల నింకొకరికి తెలుపుకొనుటే భాషవలని ప్రయోజనమనీ, అందువలన గ్రంథములు అందరికీ తెలియునట్లు సులభంగా ఉండవలెననీ' వీరేశలింగంగారి అభిమతం. ఆ అభిలాషతోనే ఆయన తెలుగులో మొదటి వచన ప్రబంధాన్నీ, మొదటి నాటకాన్నీ, మొదటి ప్రకృతి శాస్త్రాన్నీ, మొదటి ప్రహసనాన్నీ, మొదటి చరిత్రనూ, స్త్రీలకు మొదటి వచన పుస్తకాన్ని రచించాడు.

ఒక్కమాటలో చెప్పాలంటే వీరేశలింగంగారు కొత్త మార్పుకు, కొత్తపుంతలు తొక్కే తెలుగుజాతికి కొత్త ఊపిరి పోశాడు. ఆ నవయుగ వైతాళికుని కృషి ఫలితంగానే తెలుగుదేశం ఈ మాత్రమైనా వెలుగులోకి రాగలిగింది.

ముక్కోటి ఆంధ్రుల తరఫున వారికివే మా నివాళులు.

మన సమాజంలో మూఢ విశ్వాసాలు నశించకపోయినా క్షీణించుకుపోయి నేటికీ ఏదోఒక రూపంలో మనల్ని వెన్నాడుతూనే ఉన్నాయి.

70 ఏళ్ళనాడు ఏ ముహూర్తాలనూ, ఏ శకునాలనూ, ఏ దురాచారాలనూ, ఏ కట్నాలనూ, ఏ లంచగొండి తనాన్నీ వీరేశలింగంగారు నిర్భీతిగా ఎదిరించారో అవన్నీ ఆధునిక సమాజంలో తిరిగి తలయెత్తి విహరించటం లజ్జాకరమైన విషయం.

సంఘ సంస్కర్తలూ విజ్ఞానవంతులూ, ప్రజలూ నిరంతర జాగరూకతతో ఈ మూఢ విశ్వాసాలనూ, నీతి బాహ్యాలనూ రూపు మాపినప్పుడే సమాజం నవనవోన్మేషంగా విలసిల్లి ముందడుగువేస్తూ అభివృద్ధి పొందగలుగుతుంది.

నేడు వీరేశలింగంగారి 42 వ వర్ధంత్యుత్సవాలు జరుగుతున్న సందర్భంలో తెలుగునాడంతటా సంఘ సంస్కరణాభిలాషా, దీక్షా వెల్లివిరిసి సత్కార్యాచరణకు సమధికమైన ప్రోత్సాహం లభిస్తుందని ఆశిస్తున్నాం.

నిరాయుధీకరణ విషయంలో బ్రిటన్ ధోరణి

లండన్, మే 24

బ్రిటన్ తనమట్టుకుతాను నిరాయుధీకరణ చేయడమంటూ ఎన్నటికీ బ్రిటిష్ విధానం కాబోదని బ్రిటిష ప్రధాని హెరాల్డ్ మాక్మిలన్ నేడు పార్లమెంటులో ఒక లేబరుసభ్యుడు అడిగిన ప్రశ్నకు జవాబు ఇస్తూ అన్నారు.

శిఖరాగ్ర సమావేశం విఫలమయింది. 1922 నుండి జరుగుతూ వచ్చిన నిరాయుధీకరణ సంప్రతింపులు కూడా [illegible]. ఈ అన్ని కారణాలచేత బ్రిటన్ ఇప్పుడు ముందుకొచ్చి పాక్షిక నిరాయుధీకరణ విషయంలో ప్రపంచానికి నాయకత్వం వహించకూడదా అని లేబరు సభ్యుడు ఫ్రాంక్ అలన్ అన్నారు. ఉదాహరణకు అణ్వస్త్రాల పరీక్షలను, తయారీని, నిలవ చేయడాన్ని బ్రిటన్ మానివేయవచ్చుననీ, అటువంటి ఆయుధాల ప్రయోగానికై ఉన్న స్థావరాలను రద్దుచేయవచ్చుననీ ఆయన సూచించారు.

ఇతర దేశాలపై విమానాలు స్వేచ్ఛగా ఎగరవచ్చు!

అదనుచూసుకొని అమెరికా ఆ పథకాన్ని ఐరాసలో ప్రవేశపెడుతుందని ఐసెన్‌హోవర్

వాషింగ్టన్, మే 25

"పశ్చిమ రాజ్యాలను సోవియట్ యింకా నమ్మడం లేదు. అందుచేతనే అయిదు సంవత్సరాలనాడు నేను పరస్పర వైమానిక పర్యవేక్షణ నిమిత్తం "స్వేచ్ఛా విమాన యాన పథకాన్ని" సోవియట్‌కు సూచించాను. ఈ ప్రతిపాదనను అమెరికా యిప్పటికీ చేస్తోంది. అదను చూసుకొని అమెరికా ఆ ప్రతిపాదనను ఐరాసకు సమర్పించనున్నది" అని అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ నేడు దేశ ప్రజలకిచ్చిన రేడియో టెలివిజన్ ప్రసంగంలో తన పాత ధోరణినే పునశ్చరణ చేశారు.

శిఖరాగ్ర సమావేశ వైఫల్యాన్ని గురించి ఐసెన్‌హోవర్ తన ప్రసంగంలో ప్రస్తావించారు. "సోవియట్ [illegible] ఎంత హాస్యాస్పదంగా వున్నప్పటికీ సోవియట్ యూనియన్‌తో ప్రధానఅంతర్జాతీయ సమస్యలపై అమెరికా సంప్రదింపులు కొనసాగిస్తుందని ఐసెన్‌హోవర్ అన్నారు.

ఆయన యింకా యిలా అన్నారు: సోవియట్ యూనియనకు పశ్చిమ రాజ్యాలపైన నమ్మకంలేదు. ఈ రీతి ఇప్పటికీ కొనసాగుతోంది. అందుచేతనే అయిదు సంవత్సరాల క్రితం పరస్పర వైమానిక పర్యవేక్షణ నిమిత్తం స్వేచ్ఛా విమాన యాన పథకాన్ని నేను సూచించాను. ఆ ప్రతిపాదన యిప్పటికీ వుంది. దానిని అదనుచూసుకుని అమెరికా ఐరాసకు సమర్పించనున్నది. ఇటువంటి గస్తీలను ఐరాసయే స్వయంగా నిర్వహించాలనికూడా మేము సూచించదలచాం. ఐరాస ఈ ప్రతిపాదనని అంగీకరించే పక్షంలో స్వేచ్ఛా విమాన యాన పథకం అమలుకు అవసరమైన విమానాలను, ఇతర సామగ్రి అమెరికా సప్లయి చేయడానికి సిద్ధంగా వుంది.

"అమెరికా విమానాలు సోవియట్ భూభాగంపై అనేక సంవత్సరాలుగా గస్తీతిరుగుతున్న విషయం సోవియట్‌కు బాగా తెలుసు. అయినా మే 1 వ తేదీ నాటి అమెరికా యు-2 విమానోదంతాన్ని గూర్చి సోవియట్ చేయాల్సిన రభసంతా చేసింది.

"అంతకుపూర్వం నేను సూచించిన స్వేచ్ఛా విమానయాన పథకాన్ని అమలుజరిపినట్లయితే ముమ్ముందు అన్ని దేశాలకూడా గూఢచారి చర్యలనుతగ్గించడమే కాకుండా అసలు ఆ కార్యకలాపాలు జరపాల్సిన అవసరమే పోతుంది.

"సోవియట్ యూనియన్‌లో అంతా రహస్యమే అమెరికాలో స్వచ్ఛంద సంచార సమాజం అమలులో వుంది అందాకా ఎందుకు? గత సంవత్సరం క్రుశ్చేవ్ అమెరికా సందర్శించినప్పుడు కాలిఫోర్నియాలో పర్యటించారు. ఆ సందర్భంలో ఆయన రైలులో ప్రయాణం చేస్తూండగానే రైలు కిటికీలోంచి, కొన్నివందల అడుగుల దూరంలో వున్న ఖండాంతర క్షిపణి స్థావరాన్ని స్పష్టంగా చూడగలిగారు.

శిఖరాగ్ర సమావేశ వైఫల్యం

శిఖరాగ్ర సమావేశాన్ని క్రుశ్చేవ్ భగ్నం చేశారు. అమెరికా దురాక్రమణ చర్యలే తన కోపానికి కారణమని, దాని ఫలితమే శిఖరాగ్ర సమావేశ వైఫల్యమని ఆయన చెప్పారు. వాస్తవానికి యిటువంటి గూఢచారి గస్తీ చర్యలు సోవియట్ యూనియన్‌పై అనేక సంవత్సరాలుగా సాగుతున్న విషయం క్రుశ్చేవ్‌కు తెలియనిదికాదు.

"[illegible] చేయాలని క్రుశ్చేవ్ [illegible] యించుకున్నట్లు కనబడుతుంది. అలా తమదృష్టిలో నిర్మాణాత్మకమైన ఫలితాలను శిఖరాగ్ర సమావేశం ప్రసాదించలేదని కూడా మరొక నిర్ణయానికి వచ్చినట్లు కన్పడుతోంది.

"అయితే పారిస్ ఘటనలను అంతా నేను [illegible] సిరాతో వ్రాయనక్కరలేదు. సిరాతో వ్రాయదగ్గ విషయాలుకూడా అనేకం వున్నాయి. బహుశా సోవియట్ యూనియన్ [illegible]. కాని క్రుశ్చేవ్ నిందలే ప్రధానమైనాయి. ఆయన వాటిని [illegible] సత్సంకల్పాన్ని సాధించడంలో [illegible] విఫలం చేసినాయి.

"శాంతికోసం అదనంగా మరొక్క మైలు అయినాసరే ముందడుగు వేయడానికి పారిస్‌లో అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సులు మరోసారి తమ యిష్టతను ప్రకటించాయి. ఈ సందర్భంలో మా మిత్రులు బ్రిటిష ప్రధాని, ఫ్రెంచి అధ్యక్షుల ప్రవర్తన అద్భుతం.

పశ్చిమ రాజ్యాలలో చీలికలు తెచ్చేందుకు సోవియట్ ఎంత ప్రయత్నించినా నా సహచరులైన డిగోల్, మాక్మిలన్‌లు అమెరికా ప్రతినిధివర్గానికి మొదటి నుంచీ అండగా నిలబడ్డారు.

"పారిస్ సమావేశానంతరం జరిగిన ఉత్తర అట్లాంటిక్ కూటమి సమావేశం పశ్చిమరాజ్యాలమధ్య యింతకుముందెన్నడూ లేనంత ఐక్యతను సానుభూతిని కనబర్చింది. శిఖరాగ్రసమావేశంలో పశ్చిమరాజ్యాల [illegible] బలపర్చింది. ఇందుకు మా మిత్రులందరికీ నేను నమస్కరిస్తున్నా.

యు-2 విమానోదంతం

అమెరికా యు-2 విమానోదంతాన్ని గూర్చి అమెరికన్ ప్రభుత్వం మొదట్లో అసలు గూఢచారి చర్యల కోసం పంపలేదనే చెప్పింది. ఇందుకు సంబంధించిన వాస్తవ విషయాలు యింకా అప్పటికి నిర్ధారణ కానందువల్లనే, ఈ విషయంలో వైమానికుణ్ణి విమానాన్ని, ఇతర పరికరాలను రక్షించేందుకే అమెరికా ప్రభుత్వం అటువంటి ప్రకటన చేసింది.

వైమానికుని విషయమై "మాకు మొదట అందిన సమాచారాన్నిబట్టి, అసలు వైమానికుడుబ్రతికే వున్నాడో లేదో పట్టుపడకుండా తప్పించుకున్నాడో లేదో, సోవియట్ అధికారుల ప్రశ్నలకురహస్యాలు వెల్లడిస్తున్నాడో లేదో, అసలు విమానమూ, వైమానికుడూ సర్వనాశనమైపోయారా అన్న విషయమై ఏదీ తెలియలేదు. చాలకాలంగా మేము జరుపుతున్న ఇటువంటి గూఢచారి చర్యలవల్ల దేశభద్రతకు పనికివచ్చే అతి ముఖ్యమైన సమాచారం మాకు లభించింది.

గూఢచారి విమానోదంతంపై అమెరికాలో చెలరేగుతున్న రాజకీయ తర్జనభర్జనలను గురించి ఐసెన్‌హోవర్ ప్రస్తావిస్తూ ఇలా అన్నారు:

"ఈ సందర్భంలో కొందరు శిఖరాగ్ర సమావేశం త్వరలో జరుగనుండగా, ఇలా విమానం సోవియట్ యూనియన్ భూభాగంలోనికి పంపడం సరియైనదేనా అనేప్రశ్న లేవదీస్తున్నారు.

ఈ కార్యక్రమాన్ని ఆపివేసి ఆ విధంగా, తరువాత సేకరించడానికి వీలులేని ముఖ్య సమాచారం సేకరించే అవకాశం కోల్పోవడమా అనేప్రశ్న వచ్చింది. కార్యక్రమాన్ని ముందుకు నడిపించాము. అసలు విషయమిది. ఒక దేశానికి రహస్య సమాచారం అవసరమయినప్పుడు, తను అప్రమత్తతను ఒక్క క్షణంకూడా సడలించడానికి వీలులేదు. ఈ సందర్భంలో నేను [illegible] చేయవలసిందేమిటంటే, ఆకస్మిక దాడులను ముందుగా తెల్సుకోనీయకుండా దాచడానికి సంప్రదింపులనే ముసుగుగా వినియోగించవచ్చునన్న విషయం మనం పెర్ల్‌హార్బరు నుండి గుణపాఠం నేర్చుకొన్నాము."

శిఖరాగ్ర సమావేశం జరగడానికి క్రుశ్చేవ్ విధించిన షరతులను తానెలా తిరస్కరించిందీ, అమెరికా గూఢచారి విమానాలు సోవియట్‌పై ఇకముందు ఎగురకూడదని తాను ఎలా ఉత్తర్వు చేసిందీ అధ్యక్షుడు [illegible] తెలుపుతూ ఇలా అన్నారు:

"ఈ నూతన పరిస్థితులలో ఈ కార్యకలాపాలను సాగించడంవల్ల సోవియట్ యూనియన్‌తో, మన మిత్రదేశాలతో మధ్య సంబంధాలలో కొన్నిచిక్కులు ఏర్పడతాయి. ఇంతేకాదు, విమానాలు కాక, ఇతర విధాలయిన సాంకేతిక పరికరాలను మనం అభివృద్ధి చేస్తున్నాము."

సోవియట్ యూనియన్ పట్ల [illegible] అమెరికా విధానం ఎలా వుండాలనే విషయాన్ని [illegible] వివరిస్తూ శ్రీ ఐసెన్‌హోవర్ ఇలా అన్నారు:

"అపరిష్కృతంగా వున్న సమస్యలపై సోవియట్ నాయకులతో మనం ఖరాఖండిగా వ్యవహరిస్తూనేవుండాలి. మన ప్రజలకు సోవియట్ ప్రజలకు మధ్య సంబంధాలను పెంపొందించాలి. [illegible] సోవియట్ ప్రజలు తెలివితేటలతోనూ, న్యాయంతోనూ కూడిన పంథా తొక్కడానికి ఎప్పుడూ అవకాశం ఉండేటట్లు విషయాన్ని వారికి స్పష్టం చేయాలి.

ఇటీవల మనకందరికీ ఆశాభంగం జరిగినప్పటికీ, పరస్పర అవగాహనకు, ఉద్రిక్తతల సడలింపుకు, ఆయుధాల తగ్గింపుకు మనం పాటుపడడం ఎప్పుడూ కొనసాగించవలసిన అవసరమని ప్రపంచ ప్రజలతోపాటు మనమూ, గుర్తిస్తున్నాము.

ఈ శాంతి ప్రయత్నాలను మనం ఇకముందుకూడా కొనసాగిస్తాము.

సోవియట్ యూనియన్‌తో ప్రస్తుతం జరుపుతున్న సంప్రదింపుల్లో పాల్గొంటూనే వుంటాము. ఈ సంప్రదింపుల్లో కొంత పురోగతి సాధించాము కూడా. దీనిపై ఇంకా అభివృద్ధి సాధించడానికి మనం సిద్ధమే.

ఏదో ఒకనాడు ఆ పంటే సహకార భావాన్ని ఆధారంగా చేసుకొని ఈ సంప్రదింపులు మనం సాగించడం లేదు. కోపతాపాలకు జంకేదిలేదు. ఇది కొన్ని ప్రత్యేక సమస్యలపై మిత్రదేశాలయిన పాశ్చాత్యదేశాలకు, సోవియట్ దేశానికి మధ్య ఉమ్మడిప్రయోజనాలకోసం జాగ్రత్తగా జరిపే అన్వేషణ అనే దృష్టితో వ్యవహరిస్తాము.

ఈ సందర్భంలో అణు పరీక్షల నిషేధం, నిరాయుధీకరణ సంప్రతింపులు [illegible] వున్నాయి. ఇటీవల జరిగిన సంఘటనల కారణంగా, మనం చేస్తున్న ప్రయత్నాలనుండిగాని, లేక చేసిన వాగ్దానాలనుండిగాని మనం వెనక్కు తగ్గము."

అతివేగంగా శిఖరాగ్ర సమావేశానికి కొన్ని గంటలముందుగా ప్రపంచమంతటా అమెరికన్ విమానాలు సిద్ధంగా వుండాలని చేసిన హెచ్చరికను గురించి ఐసెన్‌హోవర్ ప్రస్తావిస్తూ ఇలాఅన్నారు.

"రక్షణమంత్రి శ్రీ థామస్ గేట్స్ సూచనపై యీ హెచ్చరిక చేయబడింది. అమెరికా సర్వసైన్యాధిపతి అయిన అమెరికా అధ్యక్షుడు కూడా యీ ఉత్తర్వును ఆమోదించారు.

సైనిక వ్యవహారాలశాఖ సర్వసిద్ధంగా వుందాలేదా అని పరీక్షించడానికి ఇలాంటి పరీక్షలు చాలా అవసరం. భవిష్యత్తులోకూడా ఇలాగే పరీక్షిస్తుంటాము.

మేమూ, మా మిత్రదేశాలూ మానవాళి స్వేచ్ఛగా మనగలిగేందుకే కృషి చేస్తూనే వుంటాము. పరస్పర గౌరవం, పరస్పర అవగాహన, దేశాలు నాశనం కాకుండా వుండడం—ఈ లక్ష్యాలకోసం మా కృషి యికముందు కూడా కొనసాగుతూనే వుంటుంది.

జూన్ 20 నుండి ఆంధ్రరాష్ట్ర విద్యుచ్ఛక్తి పనివారి సమ్మె

విజయవాడ, మే 25

ఆంధ్ర రాష్ట్ర విద్యుచ్ఛక్తి పనివారల సంఘం, జూను 20 తేదీనగాని, ఆ తర్వాత మరెప్పుడైనాగాని సమ్మె చేయవలెనని విద్యుచ్ఛక్తి చీఫ్ ఇంజనీర్‌కు నోటీసు ఇచ్చారు.

సంఘ అధ్యక్షుడు శ్రీ వి. ఎన్. నరసింహం (ఎం. పి.), ప్రధాన కార్యదర్శి శ్రీ [illegible] వెంకటేశ్వరరావుగార్లు సమ్మె నోటీసు నకలును లేబర్ కమిషనర్‌కుకూడా పంపినారు.

జీతాల స్కేళ్ళు, కరువుభత్యం పెంచాలని, సిబ్బందిని క్రమబద్ధం చేయాలని, వెనుకటినుండి ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, ప్రావిడెంట్ ఫండు సదుపాయాలు కలిగించాలని విద్యుచ్ఛక్తి పనివారల సంఘం 1951 నుండి ఆందోళన చేస్తున్నది. అలాగే వర్క్‌చార్జి, సినియారిటీ, ప్రమోషన్లకు సంబంధించిన సమస్యలను గూర్చి కూడ ఆందోళన చేస్తున్నది. కన్సిలియేషన్ బోర్డును ఏర్పాటు చేయాలని 1954 నుండి ఆందోళన చేస్తున్నది. ఇందుకు కూడ ప్రభుత్వం నిరాకరించింది. 1958 జూలై 1 వ తేదీన సమ్మెనోటీసు యివ్వగా, కొన్ని సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం అంగీకరించింది. 1958 ఆగష్టు 1 వ తేదీనుండి [illegible] అమలు పరచుతానని హామీ యిచ్చింది. తత్ఫలితంగా సమ్మె నోటీసు ఉపసంహరించుకోబడింది. అయితే ప్రభుత్వం తన వాగ్దానాలను [illegible] 1960 ఫిబ్రవరి నుండి ఇంటెరిమ్ అలవెన్సు [illegible].

రాష్ట్ర విద్యుచ్ఛక్తి పనివారల సంఘం కోర్కెలలో ప్రధానమైనవి ఇవి: నారాయణరావు కమిటీ, పేకమిటీ సిఫారసులను అనుసరించి, జీతాల స్కేళ్ళు, కరువుభత్యం పెంపుదల; అవసరమైన సిబ్బందిని ఇముడ్చుకోవడానికి [illegible] గుణదల, గుంటకల్లు వర్కుషాపుల అభివృద్ధి.

ఇటలీ పార్లమెంటులో ప్రభుత్వ, ప్రతిపక్ష సభ్యులమధ్య కొట్లాట సంభవించినట్లు వార్త.

ఆంధ్ర యూనివర్సిటీ ప్రోఛాన్సలర్

హైదరాబాదు, మే 25

ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖమంత్రి శ్రీ యస్. బి. పి. పట్టాభిరామారావు 1960 మే 26 నుండి మరో మూడు సంవత్సరాలు ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రోఛాన్సలర్‌గా నియమింపబడ్డట్టు గవర్నరు రాజభవన కార్యాలయం నుండి ప్రకటన వెలువడింది.

అఖిల భారత కిసాన్ సభ

గోపాలన్, భవానీసేన్‌గార్ల ఎన్నిక

ఘాజీపూర్, మే 24

అఖిల భారత కిసాన్ సభా అధ్యక్షుడుగా శ్రీ ఎ. కె. గోపాలన్, ప్రధాన కార్యదర్శిగా శ్రీ భవానీ సేన్ తిరిగి ఇక్కడ జరిగిన ఏడవ వార్షిక సభ ఆఖరిరోజున ఎన్నుకోబడ్డారు.

కిసాన్‌సభ ఉపాధ్యక్షులుగా శ్రీ బంకింముఖర్జీ, మణికంఠస్వామిగార్లు ఎన్నికయ్యారు.

సర్దార్ జగజీత్‌సింగ్ లాయల్పూరి, పెరులేకర్ (యం. పి.)గార్లు సహాయ కార్యదర్శులుగానూ, డాక్టర్ జెడ్. ఎ. అహమ్మద్ కోశాధికారిగానూ ఎన్నుకోబడ్డారు. (పి టి ఐ)

ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ మహాసభ

కోయంబత్తూరులో డిసెంబరు మొదటి వారంలో

న్యూఢిల్లీ, మే 25

అఖిల భారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు వచ్చే మహాసభ డిసెంబరు మొదటివారంలో కోయంబత్తూరులో జరుగుతుంది.

సభ ఏ తేదీల్లో జరిగేదీ ఎ. ఐ. టి. యు. సి. సెక్రెటేరియట్ తరువాత నిర్ణయిస్తుంది.

క్రిందటిసారి అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు మహాసభ 1958 లో కేరళలోని ఎర్నాకులంలో జరిగింది. (యు. పి. ఎ.)

సోవియట్ అధ్యక్షునికి భారతరాయబారి అభినందన

న్యూఢిల్లీ, మే 25

సోవియట్ నూతన అధ్యక్షుడు లియొనిడ్ బ్రెజ్నేవ్‌ను భారత రాయబారి శ్రీ కె. పి. ఎస్. మీనన్ నేడు క్రెమ్లిన్‌లో కలుసుకొని ఆయన అధ్యక్ష స్థానానికి ఎన్నుకోబడినందుకు అభినందనలు అందజేశారు.

చౌ ఎన్-లైతో మాంట్ గోమరీ

పెకింగ్, మే 25

ఫీల్డ్‌మార్షల్ విస్కౌంట్ మాంట్ గోమరీ నేడు చైనాప్రధాని చౌ-ఎన్-లైతో వ్యక్తిగత సంభాషణలు ప్రారంభించారు.

మాంట్‌గోమరీ చాలా హుషారుగా వున్నారు. చౌ-ఎన్-లైతో కరచాలనం చేస్తూ మాంట్‌గోమరీ, "మిమ్మల్ని కలుసుకున్నందుకు నాకెంతో సంతోషంగా వుంది" అని అన్నారు.

ఇరువురు నాయకులూ నేడు రెండు గంటలపాటు చర్చలు జరిపారు. తర్వాత భోజనానికి లేచారు.

మాంట్‌గోమరీ ఒక మిల్లును సందర్శించిన సందర్భంలో, అక్కడ ఒక గోడలో వున్న కమ్యూనిస్టు నాయకుల ఫోటోలను చూచి "మధ్యవున్న ఆ పెద్దమనిషి ఫోటో ఎవరిది?" అని ప్రశ్నించారు.

పొడుగాటి జుట్టు, గడ్డం వున్న ఫోటో కారల్ మార్క్సుది అని ఒకరు సమాధానం చెప్పగా, "అయితే మార్క్సుకు క్షవరం చేయాల్సిన అవసరం వుంది" అని మాంట్‌గోమరీ అన్నారు.

నెహ్రూ - దావూద్ భేటీ

[illegible], మే 25

భారత ప్రధాని [illegible] ఆఫ్ఘన్ ప్రధాని అహ్మద్ దావూద్‌తో నేడు గంటసేపు అధికారయుత సంభాషణలు సాగించారు. వీరిరువురూ శిఖరాగ్ర సమావేశం విఫలమయిన తర్వాత ఏర్పడ్డ అంతర్జాతీయ పరిస్థితిని గూర్చి చర్చించారు. సంభాషణల అనంతరం ప్రధాని నెహ్రూ తన గౌరవార్థం అధ్యక్షుడు [illegible] చేసినవిందుకు హాజరైనారు.

భారతీయ వ్యాపారి ఒకరు ప్రధాని నెహ్రూకు చుట్టూ ముత్యాలతో తాపిన భారతదేశ పటాన్ని బహూకరించారు. పటం మధ్యలో భారతీయ జండా వుంది.

నేటిరాత్రికి శ్రీ నెహ్రూ ప్రధాని దావూద్ యిచ్చే విందుకు హాజరౌతారు.

భద్రతాసంఘం చర్చ

(1 వ పేజీ తరువాయి)

మరే సైనిక మార్గాలుగాని, వైమానిక దాడులుగాని [illegible] ఖండించవలసిందిగా గ్రోమికో చెప్పిన మాటలను నిస్సందేహంగా ప్రపంచంలోని అన్ని దేశాలు ఎంతగానో మెచ్చుకుంటాయని, అయితే శాంతి స్థాపన కోసం, అమెరికా వైమానిక గూఢచారిచర్యను ఖండించవలసిందని తాను వెలిబుచ్చిన కోర్కెను సోవియట్ ఉపసంహరించుకోవడం మంచిదనీ చెప్పారు.

అంతర్జాతీయ ఉద్రిక్తతను తగ్గించే ఉద్దేశంతో సింహళం, అర్జెంటినా, ఈక్వెడార్, ట్యునీసియా దేశాల ప్రతినిధులు సంయుక్తంగా ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ప్రాక్పశ్చిమాల మధ్య తిరిగి సంప్రదింపులు జరిగేందుకు యీ తీర్మానంలో ప్రయత్నం జరిగింది. అయితే సోవియట్ తన ఫిర్యాదును విరమించుకోనంతవరకూ ఈ సంయుక్త ముసాయిదా తీర్మానంపై భద్రతాసంఘంలో చర్చ జరగదు.

తన వాదనలను అంగీకరించవలసిందిగా సోవియట్ యూనియన్ ఓటింగుపై పట్టుపట్టరాదని ఈక్వెడార్ ప్రతినిధి జోస్ కొరియా నేడు సలహా యిచ్చారు.

సోవియట్ ఫిర్యాదుపై ప్రాథమిక చర్చ పూర్తయింది. సింహళం సహా ఆ 4 దేశాలప్రతినిధులుచేసిన సూచనను గ్రోమికో అంగీకరించకపోయే పక్షంలో సోవియట్ తీర్మానంపై రేపు ఓటింగ్ వుంటుంది. ప్రాథమిక చర్చలో సోవియట్ పక్షాన ఒక్క పోలెండ్ మాత్రమే నిలబడింది.

అంతకుముందు ట్యునీసియా ప్రతినిధి మంగీస్లిమ్ మాట్లాడుతూ యు-2 విమాన సంఘటనకు దారితీసిన పరిస్థితులను దృష్టిలో చూస్తే అమెరికా దురాక్రమణ జరుపదన్న సోవియట్ ఆరోపణ సమర్థనీయంగా లేదన్నారు.

ఆయన యింకా యిలా అన్నారు; "యు-2 విమానోదంతాన్ని గూర్చి ఏర్పడ్డ వివాదాన్ని సాధారణ దౌత్య మార్గాలద్వారా పరిష్కరించుకొనవచ్చును. కాని కేవలం ఈ సంఘటన శిఖరాగ్ర సమావేశం [illegible] విఫలమవడానికి దారితీసిందని చెప్పడం సరికాదు"

భద్రతాసంఘం నేడు రెండుగంటలు చర్చించిన తరువాత సమావేశం నేటి రాత్రి వాయిదాపడింది. సోవియట్ విదేశాంగమంత్రి గ్రోమికో నేటిచర్చకు రేపు సమాధాన మిస్తానని చెప్పారు. ఈలోపున అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ అమెరికా ప్రజలనుద్దేశించి చేయనున్న రేడియో, టెలివిజన్ ప్రసంగంలో ఏమి మాట్లాడతారా వేచి చూద్దామని గ్రోమికో భావించినట్లు తెలుస్తుంది.

అంతకుముందు అమెరికా ప్రతినిధి కాబట్‌లాడ్జ్ భద్రతాసంఘం సోవియట్ ఫిర్యాదుపై వెంటనే ఓటుతీసుకోవడం అవసరమని తొందరపాటు తనం కనపర్చారు. అయితే ఓటు జరిగి తీరాలని మాత్రం ఆయన ఖచ్చితంగా చెప్పలేదు.

రేపే ఓటింగ్ :

పరిశీలకుల వ్యాఖ్యలు

అమెరికా వైమానిక గూఢచారి చర్యలు ప్రపంచశాంతికి ప్రమాదకరమని, వాటిని భద్రతాసంఘం ఖండించాలంటూ సోవియట్ యూనియన్ ప్రతిపాదించిన తీర్మానంపై భద్రతా సంఘంలో రేపే ఓటింగ్ జరుగనున్నది.

రేపటి ఓటింగులో సోవియటు, పోలెండులు మాత్రమే సోవియటు తీర్మానానికి అనుకూలంగా ఓటుచేస్తాయని యిక్కడి పరిశీలకులు భావిస్తున్నారు. నేటి సమావేశం ఓటింగ్ జరక్కుండానే వాయిదాపడ్డం గ్రోమికో ఎత్తుగడకు ఒక నిదర్శనంగా ఈ పరిశీలకులు పేర్కొంటున్నారు. నేటిరాత్రి శిఖరాగ్ర సమావేశ వైఫల్యంపై అమెరికా ప్రజలనుద్దేశించి అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ చేయనున్న ప్రసంగంలో [illegible] సోవియట్ తన ఫిర్యాదుపై ఓటింగ్‌లో ఓడిపోవడం తథ్యం అని చెప్పే [illegible] ఆయనకు లేకుండా చేయడమేగాక, ఐసెన్‌హోవర్ చేయనున్న వాదనలకు రేపు సమాధానం చెప్పే అవకాశాన్ని గ్రోమికో తనకు పదిలపరచుకో గలిగాడని కూడా ఈపరిశీలకులు అంటున్నారు.

నేటి సమావేశంలోనే యు-2 విమానోదంతంతోపాటు అకస్మాత్తుగా అల్జీరియాసమస్యకూడ చర్చకురావడం ఒక విశేషం. ఫ్రాన్స్, ఫ్రెంచి లేదా అల్జీరియా - ఈ [illegible], ట్యునీసియా ప్రతినిధి స్లిమ్, అల్జీరియాలోని స్థావరాలనుండి ఫ్రెంచి విమానాలు ట్యునీసియా ఆకాశ సరిహద్దులను ఉల్లంఘించిన విషయాన్ని సావధానంగా వివరించారు. దీనిపై ఫ్రెంచి ప్రతినిధి మాట్లాడుతూ, ట్యునీసియా సరిహద్దులను అతిక్రమించవద్దని ఫ్రెంచి ప్రభుత్వము ఫ్రెంచి వైమానికులకు ఉత్తర్వు యిచ్చిందని చెప్పారు.

పత్రికలపై నిషేధాజ్ఞలు

జలంధర్, మే 25

జలంధర్‌లో అయిదు దిన పత్రికలపై పంజాబు ప్రభుత్వం నిషేధాజ్ఞలను జారీ చేసింది. పంజాబీ సుబా ఆందోళనకు సంబంధించిన వార్తలను ప్రచురించరాదని ఆ పత్రికలను ప్రభుత్వం ఆదేశించింది.

నిషేధాజ్ఞలు జారీచేయబడిన పత్రికలు ఇవి: ప్రభాత్, అకాలీ, వీర్‌ప్రతాప్, ప్రతాప్, హింద్ సమాచార్.

అకాలీపత్రికలైన ప్రభాత్, అకాలీల సంపాదకవర్గాలను చెందిన పన్నెండుమందిని కూడా అరెస్టు చేశారు. ఆ పత్రికల కార్యాలయాలను సోదా కూడా చేశారు.

శిరోమణి గురుద్వారా ప్రబంధక కమిటీ అధ్యక్షుడైన సర్దార్ అజిత్‌సింగ్ బాల, శాసనసభ్యుడు మాస్టర్ ప్రతాప్‌సింగ్ గార్లను అంబాలాజిల్లాలోని రూపార్‌లో గత రాత్రి అరెస్టు చేసినట్లు యిక్కడికి వార్తలు అందాయి.

పంజాబీ సుబా ఆందోళన కోసం [illegible] నిర్వహించడానికి శిరోమణి గురుద్వారా ప్రబంధక కమిటీ అధ్యక్షపదవికి రాజీనామా యిచ్చిన తరువాత ఆ స్థానానికి సర్దార్ అజిత్‌సింగ్ యిటీవలనే ఎన్నికయ్యారు.

జలంధర్‌లో ఏడుగురు అకాలీదళ్ కార్యకర్తలు అరెస్టు చేయబడ్డారు. వీరిలో మాస్టర్ తారాసింగ్ కుమారుడు సర్దార్ మోహన్‌సింగ్‌కూడా వున్నారు. సర్దార్ మోహన్‌సింగ్ అకాలీదళ్ అధికార దినపత్రిక "ప్రభాత్" సంపాదకుడుగా ప్రస్తుతం పనిచేస్తున్నారు.

తారాసింగ్ డిటెన్షన్

గత రాత్రి ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టంక్రింద అరెస్టుచేయబడిన మాస్టర్ తారాసింగ్‌ను నేడు ధర్మశాలకు తీసుకొనిపోయి అక్కడ సబ్‌జైలులో వుంచారు.

ముఖ్యమంత్రి సర్దార్ ప్రతాప్‌సింగ్ ఖైరాన్ పత్రికా విలేకరులతో మాట్లాడుతూ, అమృతసర్ జిల్లా అధికారుల సలహామీదనే మాస్టర్ తారాసింగ్‌ను రాష్ట్రప్రభుత్వం అరెస్టు చేసిందన్నారు.

డిటెన్షన్‌లో వున్నప్పుడు మాస్టర్ తారాసింగ్‌కు తగిన సౌకర్యాలను కల్పించి మర్యాదగా చూడాలని ఆర్డరు జారీచేశామన్నారు.

జైలులో మాస్టర్ తారాసింగ్ నిరాహార దీక్ష బూనే అవకాశం వున్నదని మీరు అనుకొంటున్నారా అని ప్రశ్నించగా, 'ఆయన అలాంటి తెలివితక్కువ చర్యను తీసుకొంటారని' తాననుకోవడంలేదని ముఖ్యమంత్రి అన్నారు.

"మాస్టర్ తారాసింగ్ అకాలీలలో ఒక వర్గానికి మాత్రమే నాయకుడు. అందువలన ఆయన నిరాహార దీక్షను బూనేంతటి అవివేకి అని నేననుకోను."

మాస్టర్ తారాసింగ్ డిటెన్షన్‌లో వున్న కాలంలో ఆయన కుటుంబానికి అలవెన్సును ప్రభుత్వం చెల్లించదలచిందా అని ప్రశ్నించగా "లేదు" అని ముఖ్యమంత్రి జవాబు చెప్పారు.

క్షయ, హృద్రోగాల సంస్థ ప్రారంభోత్సవం

హైదరాబాదు, మే 25

ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ పి వి. జి రాజు నేడు క్షయ, హృద్రోగాలసంస్థకు ప్రారంభోత్సవానికి అధ్యక్షత వహిస్తూ, రోగ నిరోధక చర్యలలో విద్యావంతులంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

క్షయరోగ నివారణ కార్యకలాపాలన్నింటినీ ఈ సంస్థ అజమాయిషీ క్రిందికి తెస్తున్నారు.

ఈ సంస్థను ఉప ముఖ్యమంత్రి శ్రీ కె. వి. రంగారెడ్డి ప్రారంభోత్సవం చేశారు. దీని కార్యాలయం ఇక్కడి క్షయ ఆసుపత్రి ఆవరణలో క్షయ నివారణభవనంలో నెలకొల్పారు.

రాష్ట్రంలోని ఆసుపత్రి సలహా సంఘాలనుగురించి శ్రీ పి వి. జి. రాజు ప్రస్తావిస్తూ, వాటిలో కొన్ని సరిగా పనిచేయడం లేదని, అవి అన్నివర్గాలకు ప్రాతినిధ్యం వహించడం లేదనీ అన్నారు. క్షయరోగ నివారణసంఘం వంటి అనధికార సంస్థలు రాష్ట్రంలో మరికొన్ని ఏర్పడవలసిన అవసరమున్నదన్నారు.

శ్రీ కొండా వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ క్షయవ్యాధి నిర్మూలించాలంటే దేశంలో దారిద్ర్యాన్ని పారద్రోలి జీవన పరిస్థితులను బాగు చేయాలన్నారు.

క్షయ ఆసుపత్రులలో పడకలు తక్కువగావున్నందువల్ల, ఈ ఆసుపత్రులలో రోగులను చేర్చుకొనే సందర్భంలో పేదలకు ప్రాధాన్యత చూపాలన్నారు. డబ్బున్నవారు తమ యిళ్ళలోనే వుండి చికిత్స చేయించుకోగలరన్నారు.

మంత్రులకు స్వాగతం చెప్తూ, వైద్యశాఖ డైరెక్టరు మేజరు కె. ఎస్. రావు 1959 ఆఖరుకు రాష్ట్రంలో 60 లక్షల ప్రజలకు వాక్సీనేషను చేశామని తెలియజేశారు.

హైదరాబాదులో క్షయవ్యాధి నిరోధక చర్యలనుగూర్చి డా. యం. ఎ. రహమాన్ వివరించారు. డా. [illegible] క్షయ ఆసుపత్రిపై నివేదిక చదివారు.

రాజ్యాంగ స్వాతంత్ర్యంతో బాటు సాంఘిక సంస్కరణల అవశ్యకత

ఆంధ్ర మహాజనులకు వీరేశలింగంగారి తుది విజ్ఞప్తి

దాదాపు అర్థశతాబ్దకాలం ఆంధ్రదేశంలో తాము సాగించిన సంఘసంస్కరణోద్యమాన్ని, ఈ ఉద్యమ ఫలితంగా సాధించిన పురోగమనాన్ని సింహావలోకనంచేస్తూ వీరేశలింగం పంతులుగారు తమ స్వీయచరిత్రలో ఆంధ్ర మహాజనులకు ఒక తుది విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగ స్వాతంత్ర్యాన్ని సంపాదించుటతో బాటు సాంఘిక సంస్కరణలను కూడా సాధించాలనీ, లేనిచో సమగ్రాభివృద్ధి కొరవడుతుందనీ ఆయన తన యీ విజ్ఞప్తిలో ప్రధానంగా పేర్కొన్నారు. సాంఘిక ప్రబోధమూ, సంస్కరణోద్యమమూ తగినంత ఉచ్ఛస్థాయిలో లేని ప్రస్తుతస్థితికి వీరేశలింగంగారి హెచ్చరిక నిజంగా వర్తిస్తుంది. ఈనాటి మన కర్తవ్యం ఏమిటో చక్కగా నిర్దేశించుతుంది.

ఆంధ్ర మహాజనులను, రాజమహేంద్రపుర వాస్తవ్యులను ఉద్దేశించి 1910 లో వీరేశలింగంగారు చేసిన విజ్ఞప్తిలో ఈవిధంగా వుంది:

"సావధాన చిత్తంతో నా విన్నపమాలకింపుడు. దేశాభివృద్ధికి సంస్కారములన్నియు విషయములలో నొకసమానముగా నుండవలయును గాని యొక్క విషయములలో మాత్రమే నడచుచుండుట చాలదు. ఏకవిషయాభివృద్ధి ఎప్పుడును నిజమైన అభివృద్ధి కానేరదు. ఈ సత్యమును మనవారి మనస్సులలో దృఢముగా నాటింపవలెనని యీ వరకెన్నియో సారులు నా యుపన్యాసములలో చెప్పుచూవచ్చినను తనివి చెందక చెప్పినదానినే కడపటి మీ కిప్పుడు మరల జెప్పుచున్నాను. శరీరమందలి సమస్తాంగములను పరస్పరానుకూలముగా నెనుగక యొక కడుపో కాలో మిక్కిలిగా పెరిగినప్పుడు దానిని మహోదరశ్లీపదాది నామములలో నశుభదాయకమైన రోగచిహ్నముగా నెట్లు భావింతుమో యట్లే ధార్మిక సాంఘికాభివృద్ధి ప్రయత్నము నుపేక్షించి యొక్క రాజ్యాంగ స్వాతంత్ర్యాభివృద్ధిని గూర్చియే యుద్యమించుటయు సంపూర్ణసుఖము కాజాలదని భావించవలయును.

ఇంటా బైటా కూడా సంస్కరణ

బయట సుఖదాయకములైన రాజ్యాంగ స్వాతంత్ర్యములను సంపూర్ణంగా పొందగల వారమైనను మన యింట కుటిల కులాచార భూతమునకు దాసులమయి కడుపునబుట్టిన బిడ్డల స్వాతంత్ర్యములనైన నియ్యజాలక యా యబోధ బాలల సంతతి దుస్సహ వైధవ్యదుఃఖముల పాలయి బాధపడుచుండగా జూచుచు మనమేమి సుఖమనుభవింపగలుగుదుము? ఇంట సుఖదాయకములైన సత్కులాచార స్వాతంత్ర్యములను సంపూర్ణంగా బొందగలవారమైనను బయట ధనప్రాణములకు రక్షణము చేయని క్రూర నిరంకుశ ప్రభుత్వమునకు నిరంతర దాస్యము చేయవలసిన యెడల నేమి సుఖమనుభవింపగలుగుదుము? ఇంటను, బయటనుగూడ హీన దాస్యమునుండి విముక్తులమయి యుభయ స్వాతంత్ర్యములను బొందగలిగినప్పుడుగదా మనము నిష్కళంక సౌఖ్యమునొంది యవ్యాజానందము నొందగలుగుదుము?

కాబట్టి నిజమైన దేశక్షేమము నపేక్షింప దలచిన దీని నుపేక్షింపక సమస్త స్వాతంత్ర్యముల నిమిత్తమును, సమస్తాభివృద్ధుల నిమిత్తమును సమానముగా కృషిచేయుడు. అప్పుడు మీరు మీ దేశమును సౌఖ్యవంతంగాను, సంతోషవంతంగాను సభ్యుదయవంతముగాను చేయగలుగుదురు.

అర్థశతాబ్దంలో తెలుగుదేశ పురోభివృద్ధి

ఇప్పుడు మన యాంధ్ర దేశము మేలుకొని కన్నులు తెరచి మాంద్యమును మాని చురుకుదనమును పూని దేశాభివృద్ధికరములైన నానాక్షేత్రముల యందు మహోత్సాహముతో కృషిచేయుచున్నందుకు నే నెంతయు సంతోషించుచున్నాను. ఇది మన దేశముయొక్క పురోభివృద్ధికి శుభసూచకముగా నున్నది. ఇటువంటి స్థితి మన మాతృభూమికి కలుగగా జూడవలెనని నేను ముప్పది సంవత్సరముల క్రిందట నభిలషించుచుంటిని. అప్పుడా కోరిక దివాస్వప్న సదృశముగా కనబడినది; ఇప్పుడది ప్రత్యక్షసిద్ధమయినది అప్పుడు రాజమహేంద్రవరమువంటి పట్టణములలో సహితము యువజనులు సభ చేయుటయే సామాన్య జనుల దృష్టికి తప్పిదముగ గనబడుచుండెను; ఇప్పుడు చిన్న పల్లెలయందు సహితం సభలు జరుగుచూ నందు వివిధ విషయములు విమర్శింపబడి జనసామాన్యముచే మెప్పొందుచున్నవి అప్పుడు స్త్రీ విద్యపేరు చెప్పినంత మాత్రాన తిలకంటకముగానుండి బహుజనులచే దూషింపబడుచుండెను. ఇప్పుడెల్లయెడల బాలికా పాఠశాలలేర్పడి స్త్రీ విద్య యభివృద్ధినొంది సభలు, సంఘములు పుస్తకములు చేయగల స్త్రీల నొప్పి భూషింపబడుచున్నది అప్పుడు దేశభాషలో పురుషులు చదువుట సహితమూ తగినపుస్తకములు లేకుండినవి; ఇప్పుడు పుస్తక రచనకయి సమాజము లేర్పడి పురుషుల కుపయుక్తములైనవి మాత్రమే కాక స్త్రీలు చదువదగిన పుస్తకములుగూడ దినదినాభివృద్ధి నొందుచున్నవి. అప్పుడు విద్యాభిరుచిగల ధనవంతులకే పుస్తక సంపాదనము బహు వ్యయప్రయాసలతో లభ్య మగుచుండెను; ఇప్పుడు దూరదూర పఠనమందిరములు ప్రబలి బీదలకును పుస్తక సంపాదన మత్యల్ప వ్యయసాధ్య మగుచున్నది. అప్పుడాంధ్ర వార్తాపత్రికలంతగా లేకయు ఉండిన యొకటి రెండును జరుపువారు లేకయు, దినావశ్యక్రమముల వలె నేడిల్లలుండెను, ఇప్పుడు దేశభాషా వృత్తాంత పత్రిక సంఖ్య యధికమయి వేలకొలది చదువరులను గలవయి కొన్ని పట్టపగటి సూర్యునివలె ప్రకాశించుచున్నవి. అప్పుడు ధూమనౌకమీద విద్యాగమము కొఱకు చెన్నపురికి వెళ్ళిన వారికి ప్రాయశ్చిత్తములు విధింపబడుచుండెను; ఇప్పుడు విద్యావాణిజ్య శిల్ప శాస్త్రాభ్యాసార్థమయి ఖండాంతరములకును, ద్వీపాంతరములకును బోయి వచ్చిన వారికిని ప్రాయశ్చిత్తముల క్కరలేకపోవుచున్నవి. ఇటువంటివి చెప్పబూనినచో వేనకములు చెప్పవచ్చును ఈ సంవత్సరము బాపట్ల మొదలయిన స్థలములయందు జరిగిన సభలను, సభలలో జనులు చూపిన యుత్సాహమును మనదేశముయొక్క వర్తమాన స్థితిని, కర్తవ్యనిష్ఠను వ్యగ్రతను నూతనోద్యోగాను రాగమును, సహస్రముఖముల జాటుచున్నవి.

జోహార్ కందుకూరి

— సమతారావు

వీరేశలింగ మా జోహారు నీకు
నీ జీవితంబెపుడు మేల్కొలుపు మాకు
తెలుగు భాషకు నీవు చేసినసేవ
తెలుగుజాతికి తెచ్చె వెలలేనిచేవ
వెఱ్ఱి విశ్వాసాల వేళ్ళనరికావు
పరిశీలనా దృష్టి పంచిపెట్టావు.
అందాల గ్రంథాలు అందించినావు.
విజ్ఞాన గ్రంథాలు వెదజల్లినావు.
స్త్రీ గౌరవము దేశమంటా చాటావు
స్త్రీ జాతి ముక్తికై పోరాడినావు.
అక్రమాలన్నిటిని ప్రతిఘటించావు.
లొంగుబాటేలేని పోరునడిపావు.
బాధితులకెల్లపుడు బాసటైనావు.
బ్రతుకంత ప్రగతికై ధారపోశావు.
అవినీతిపరులకు వాడల నీపేరు.
కార్యశూరత్వమున కది మారుపేరు.
యుగపురుషుడను బిరుద మొందుకున్నావు.
నీపేరు స్థిరముగా నిలుపుకున్నావు.
నీకు నీవేసాటి ఆదర్శమూర్తి!
నీజీవితము తెలుగుజాతికే కీర్తి!

కార్యశూరులు కండి!

అయినను సాంఘికసంస్కారాదుల యందు మనవారికి మాటలవికల శూరత్వము కార్యములలో నింకను నేనభిలషించినంత కనబడుచుండలేదు. ఈ యుద్యమములలో, మాటలెక్కువగాను, కార్యములు తక్కువగాను కావలసినవి కొన్ని మాటలు తక్కువగానూ, కార్యము లెక్కువగానూ కావలసినవి కొన్నీ. రాజ్యాంగ సంస్కార ప్రయత్నమందు మొదటి తరగతిలోనిది; సాంఘిక సంస్కార ప్రయత్నమందు రెండవ తరగతిలోనిది. మొదటిదానికంటె రెండవదానిలో ప్రయాసమెక్కువ యున్నది. ఈ రెంటిలో సంఘ సంస్కారము మన చేతిలో నున్నది. రాజ్యాంగ సంస్కారము దొరతనంవారి చేతిలోనున్నది. ప్రయత్నము చేసిన యెడల స్వాధీనమయి యున్న సంఘ సంస్కారమునందు జయము పొందుట నిశ్చయము; పరాధీనమయియున్న రాజ్యాంగ సంస్కారమునందు జయము పొందుట సందేహము మన చేతిలోనుండి మనం చేయవలసినది నిర్భయముగా చేసినప్పుడుగదా మనము నిర్మల మనస్కులమనియు, విశ్వాసపాత్రులమనియు, లోకమునకు తేటపడును కాబట్టి, రాజ్యాంగ స్వాతంత్ర్య సంపాదనోత్సాహము చేత సంఘ సంస్కరణ ప్రయత్నము నుపేక్షింపకుండవలయునని మనవారిని వినయపూర్వకముగా వేడుచున్నాను. ఓ విద్యార్థులారా! మన సంఘస్థితి బాగుపడినదిగాని ప్రభుత్వము వారనుగ్రహించెడు రాజ్యాంగ స్వాతంత్ర్య ఫలములను మనము నిర్విచారముగా ననుభవింపజాలము. ఈ సత్యమును మీరుదృఢముగా మనస్సునందుంచుకొని సంఘ సంస్కారోద్యమమునందు గూడ సమాన శ్రద్ధను వహించి పని చేయుడు."

(స్వీయచరిత్ర 457-460 పేజీలు)

ఆంధ్ర జాతీయ పునర్వికాసానికి మూలపురుషుడు

"వీరేశలింగంగారి పుట్టుక నాటికి మన దేశంలో పెట్టుబడిదారీ వుత్పత్తి విధానం ప్రవేశించింది. కానీ ప్రజలను ఇంకా జమిందారీయుగపు సంకెళ్ళలోనే మూఢవిశ్వాసాల క్రిందనే బ్రిటిషు సామ్రాజ్యవాదులు వుంచారు. ప్రజలలో కుల మత కక్షలు మూఢ నమ్మకాలు అంతరించలేదు. జమిందారీ యుగపు సాహిత్యం ప్రజాస్వామ్యానికి అందుబాటులో లేదు.

ఈ పరిస్థితులలో వీరేశలింగంగారు రంగంలో ప్రవేశించారు. మూఢ విశ్వాసాలను, ఆచారాలను ఎదిరించి పోరాడారు. సాహిత్యాన్ని, విజ్ఞానాన్ని ప్రజలకు అందుబాటులోకి తేడానికి కృషిచేశారు. ఒక నూతన సంస్కృతిని ఆంధ్రజీవితంలో ప్రవేశపెట్టారు. తద్వారా ఆంధ్రజాతీయ పునర్వికాసానికి పునాదులు వేశారు.

నవ్యాంధ్ర నిర్మాత - యుగపురుషుడు కందుకూరి వీరేశలింగం పంతులుగారు - (చివరి దశలో తీసిన ఫోటో.)
జననం: 16-4-1848 — నిర్యాణం: 27-5-1919.

మరణ సమయంలో యిచ్చిన తుది సందేశం

వీరేశలింగం పంతులుగారు 1919 మే 27 వ తేదీన మద్రాసులో కీర్తిశేషులయ్యారు. మరణ సమయంలో ఆయన యిలా సందేశం యిచ్చారు:

"నా జీవితంలో సాధించవలసిన కార్యములింకెన్నో ఉన్నవి. అవి సాధించబడక పూర్వమే అసువులు వీడవలసి వస్తున్నది. అయినా నా అనుచరులు, మిత్రులు, సంస్కారాభిలాషులు నా యీ మిగిలిన బాధ్యతను నిర్వర్తిస్తారని ఆశిస్తున్నాను. అమాయకత్వంలో జీవిత సంస్కారంలేని ప్రజా సామాన్యానికి విద్య, విజ్ఞానం, సమానత్వం సంస్కారం కల్గించడానికి కృషి చేయాలని కోరుతున్నాను.

నవయుగ వైతాళికుడు

అర్థశతాబ్దకాలం క్రిందట వీరేశలింగం లేవదీసిన సాంఘిక విప్లవం

శ్రీ పడాల రామారావు

19 వ శతాబ్దంలో రాజమహేంద్రవర పట్టణంలో యుగపురుషుడు వీరేశలింగం వుద్భవించాడు. కవితాకేళితో, ఆయన తన వ్యవసాయాన్ని కుంచించుకోలేదు. సారస్వతం, సాంఘికాభ్యుదయ సాధనకు ఒక ఆయుధం కావాలని, దృఢదీక్ష దురంధరుడై అన్ని ముఖాలుగా తన కృషిని సాగించాడా మహానుభావుడు. జీవితం సర్వతోముఖమైనదని అర్థం చేసుకొన్నాడు. సర్వతోముఖ జీవిత వికాసానికి కొనవూపిరినీ, చివరి చమట బిందువును కూడా వెచ్చించాడు.

ఆనాడు బొంబాయిలో ఒక గోవింద రనడే, కలకత్తాలో ఒక ఈశ్వర చంద్ర విద్యాసాగర్ లే సాంఘిక సంస్కరణకు నడుంబిగించారు. కాని తెలుగు దేశంలో శ్రీ కందుకూరి జన్మించి తెలుగు ఖ్యాతిని అన్ని దిశలకూ ప్రాకించగల మహత్తర కార్యాలు చేశారు. సాంఘిక సంస్కరణలే కాదు. స్త్రీ జనోద్ధరణ, పౌరపరిపాలనాభ్యుదయం, పారస్వత వ్యాసంగం, ఇదీ, అదీ అననేల? అన్ని మార్గాలలోనూ, ఆ మహానుభావుడు కృషిచేశాడు. ఆ రోజుల్లో దయ్యాలపై బ్రతికే భూతవైద్యులు వీధికొకరుండే వారు. కాని పంతులుగారు పెరిగి పెద్దవారవుతున్న కొద్దీ ఆ మూఢనమ్మకాలు హారతి కర్పూరంలా హరించిపోసాగాయి.

జాతకాలలో దీర్ఘాయుష్మంతుడని రాసినవాడే అకాలమరణం చెందడం, అల్పాయుష్షులు చిరంజీవులు కావడం, ధనికుడు పేద కావడం, పేద ధనికుడు కావడం, దీర్ఘసుమంగళీలు అని రాయబడ్డవారు - బాల్య వితంతువులు కావడం - ఇవన్నీ చూచి ఆయనలో దయ్యాలకూ, భూత వైద్యులకూ, వ్యతిరేక ఆవేశం పెల్లుబికింది. దయ్యాలను చూపించమని సవాలు చేస్తూ, భూతవైద్యునికూడా, తను శ్మశాన వాటికకు వెళ్ళేవారు. భయపడి భూతవైద్యుడే పారిపోయాడుగాని తనుపారిపోలేదు. ఆ రోజుల్లో భూతవైద్యులకు వ్యతిరేకంగా నిలబడదలుంటే, నెంచి నెంచి రాతికొండలను ఢీకొన్నట్టే లెఖ్ఖ!

విద్యార్థి దశ

ఒకనాడు స్కూలులో ఇంగ్లీషు ఉపాధ్యాయుడు వైయాపురి మొదలియారుగారు, పిల్లలకే ఇంగ్లీషు బోధించలేని అజ్ఞానుడై వుండగా, ఆయనను మార్చివేయాలని, విద్యార్థులచే సంతకాలు సేకరించి వుపాధ్యాయునివల్ల ఎన్ని కష్ట నిష్ఠురాలు,

(మిగతా 4 వ పేజీలో)

"ఇదే పంతులుగారు ఆంధ్రజాతికిజేసిన విప్లవకరమైన సేవకే శ్రీ వల్లూరి సూర్యనారాయణగారు చెప్పినట్లు వీరేశలింగంగారు మొదలుపెట్టినదీ సాంఘిక విప్లవం"

— శ్రీ మద్దుకూరి చంద్రశేఖరరావు,
(అభ్యుదయ 1948 ఏప్రిల్ వీరేశలింగం శతవార్షిక జయంతిసంచిక)

వీరేశలింగం చూపిన ఆదర్శాన్ని అనుసరించి వరకట్నాలను రూపుమాపండి

పంతులుగారి అనుయాయులు, ప్రసిద్ధ కవులు కీ. శే. చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు చేసిన విజ్ఞప్తి

వీరేశలింగంగారితో చేయీచేయీ కలిపి సాంఘిక సంస్కరణోద్యమాలలో పాల్గొన్న సుప్రసిద్ధకవులు కీ. శే. చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు తమ స్వీయచరిత్ర తుది భాగంలో ఆంధ్రలో నడచిన సాంఘిక సంస్కరణోద్యమాన్ని సింహావలోకనం చేస్తూ ఇలా వ్రాశారు:

నా జీవితకాలములో నాంధ్ర దేశమునందు పెన్నో మార్పులు జరిగినవి నా చిన్నతనమునందు కందుకూరి వీరేశలింగముగారు సంఘసంస్కరణ మారంభించిరి. ఆయన వెంటవెంటనే సదుద్యోగస్థులు లంచములు పుచ్చుకొనకుండా చేయవలయుననియు, వివాహాది శుభకార్యములలో భోగము మేళములు పెట్టకుండా చేయవలయుననియు, సదుద్యోగస్థులు ప్లీడరులు భోగము వాండ్ర నుంచుకొనకుండా చేయవలయుననియు సంకల్పించి, పిమ్మట వితంతు వివాహముల నారంభించిరి. ఈ సంకల్పములలో వీరేశలింగముగారు చాలావరకు కృతార్థులైరి. ఒక గవర్నమెంటు ప్లీడరు యొక్కయు, నొకడిస్ట్రిక్టు మునసబు యొక్కయు వాత్సల్యాలతో లంచగొండులసంఖ్య కొంతకాలము చాలావరకు తగ్గినది.

లంచగొండి తనం

పూర్వకాలమాంగ్లేయ విద్యనేర్చిన వారికి గొప్ప యుద్యోగములిచ్చిన పక్షమున లంచగొండితనము చాలవరకు తగ్గిపోవునని జిల్లాకలెక్టరులు, జిల్లా జడ్జీలు మొదలగువారాంగ్లేయ విద్య నేర్చినవారికి గొప్పయుద్యోగముల నీయ నారంభించిరి. కాని వారు కూడా వెనుకటివారి దారినే త్రొక్కి, రెండు చేతుల లంచములనందుకొన నారంభించిరి. ధన మెంతవారికైన భ్రమ పెట్టును గదా! శాస్త్రమెంతజదివినప్పటికీ దుర్జనుడు సజ్జనుడు కాడు. మైనాక పర్వతము లక్షలకొలది ఏండ్లు సముద్రములో నున్నను లేశమైన మెత్త పడలేదు. అట్లే దుర్జనుడు బహుశాస్త్ర పారంగతుడైనను మంచివాడు కానేరడు. ఆ విషయమై ప్రకృతస్థితి యించుమించుగా మునుపటివలెనే యున్నది. కోర్టులలో బనియుండి మనము వెళ్ళిన పక్షమున, యెక్కడనో ముగ్గురు నలుగురు తప్ప తక్కువవారందరు చేయి జాపువారే. వీరందరు పరీక్షల యందు కృతార్థులైనవారే! దీని ముఖ్యకారణము దారిద్ర్యమే యని నా యభిప్రాయము. గుమాస్తాల కుటుంబము పెరిగి ఖర్చు లెక్కువైనవి. దానికి తోడుగా జీతములు తక్కువ. రాజబంధువు లగుటచే కాబోలు నాంగ్లేయులకు ప్రతి శాఖలోను జీతము లెక్కువ. మనవారికికూడా నధికారులు తగిన జీతము లిచ్చిన పక్షమున లంచగొండి తనములు మన దేశములో నిర్మూలనమగును అంతవరకు నిది ప్రతిశాఖలోనూ నుండెడిదే. గృహమందు తండులములు లేకపుడు గుమాస్తా లంచములు పట్టక, తిప్పుడువ్రాతలు వ్రాయక, దారాపుత్రులను మాడ్చి చంపువా? కష్టస్థితిలో నీతిమంతులై యుండుట దుర్లభము.

ఇక భోగము మేళముల మాట జాతము. వివాహాది శుభకార్యములలో నాంగ్లేయ విద్యాభ్యాసము చేసిన యుద్యోగస్థులు, న్యాయవాదులు భోగము మేళములు పెట్టుటమానిరి. ఇప్పటికిని మిక్కిలి పల్లెటూళ్ళయందును, వైశ్యులు మొదలైన వారిండ్లయందును భోగముమేళము లేని పక్షమున శోభస్కారముగాదనియు, పలుగురుజేరరనియు వేశ్యలకాదరణము జరుగుచున్నది. ఈ వేశ్యానిరసనమును గురించి వీరేశలింగముగారేగాక రఘుపతి వెంకటరత్నం గారును కృషిచేసిరి. వారితో నేనును మహోపన్యాసములు జేసియు, పత్రికలలో వ్రాసియు, పని చేసితిని. మేము చేసిన పనికి ఫలితములు కనపడినందుకు సంతసించుచున్నాను.

వరకట్న దురాచారం

వివాహముల యందలి కట్నములు లేకుండా చేయవలయునని వీరేశలింగంగారు శ్రమపడిరి. వారితో బాటు నేనును మొదటి నుండియు ఏకీభవించుచున్నాను. కానీ యీ విషయమై యెందరెంత ప్రయత్నము జేసినను మంచి ఫలితములు కనబడలేదు. విద్యావంతులీవిషయమున ముందంజవేసి మార్గదర్శకులౌదురని మేమాశించితిమి. గాని మా యాశ నిరాశయైనది. విద్యావంతులైన కొలది పెండ్లికొడుకులకును, వారి తల్లిదండ్రులకును ధనాకాంక్ష క్రమక్రమముగా హెచ్చినది. అది చికిత్సకు సాధ్యమగునట్లు తోచదు. గొడ్లను కటికివాని కమ్ముకొన్నట్లు తండ్రి కన్నకూతురును ముసలివానికో, మూర్ఖునికో కొన్ని వందల రూపాయల కమ్ముకొనుట యెంతపాడుపని. ఈవిషయమై చాలాకాలము బహువిధములుగా పత్రికలలో వ్రాసియు, వేదికలపై నుండి యుపన్యాసములిచ్చియు ప్రబోధము జేసితిమి కానియది బూడిదలో బోసిన పన్నీరైనది. వివాహముల విషయమై యాడుపిల్లలతల్లిదండ్రులుతమపుత్రికలకు మంచివరులను వెదకలేని, ఋణములను జేసి యిండ్లు దీర్చలేక గృహారామక్షేత్రములను విక్రయించుకొని, దరిద్రావస్థలపాలగుచున్నారు. ఆడపెండ్లివారు తమకు గులాములని మగపెండ్లివారు భావించి, యాడుపెండ్లివారి కొంపలు బందిపోటు దొంగలవలె దోచుకొనుచున్నారు. ఈ దురభ్యాసము మడుగంటినగాని దేశము బాగుపడదు. విద్యావంతులైన యువకులు కొందరు బయలుదేరి యాడుపెండ్లివారు కట్నములు ఇచ్చెదరని చెప్పినను, తల్లిదండ్రులు తీసికొనుటకు బలవంతపెట్టినను ధైర్యముబూని వారిమాట నిరాకరించి నీతిమంతులై కట్నములు, కానుకలు, లంచములు దీసుకొనకుండా వివాహముచేసి కొన్న పక్షమున నీదురాచారము తుదముట్టును. దేశాభిమానము గలవారట్టి యువకులను దగిఱట్లు ప్రోత్సాహపరచి యట్టి వివాహములకే ప్రకటింపవలెను

పిల్లనమ్ముకొన్న వానినెంత నీచముగ మనము జూచుచున్నామో కట్నము పుచ్చుకొన్న తండ్రినిగూడా నంత నీచముగాజూచి నిరసింపవలెను. కట్నం దీసికొనుట గౌరవమని భావించుట దేశంలో నశింపవలెను. అది నీచమనియు, నవినీతియనియు జనులలో భావమేర్పడవలెను. ఇది పూర్వ మగ్రజాతులలోనే యుండెడిది. కాని

(మిగతా 4 వ పేజీలో)

పిలుపు

శ్రీ మారిశెట్టి నాగేశ్వరరావు

ఓహోహో తెలుగన్నా!
ఒకసారి నిలుమన్నా!!
సాగిపోవు నీవధాన
సానుభూతి హృదయాన
ఒకసారి నిలుమన్నా!
ఓహోహో తెలుగన్నా!
మాన్యసేవజేసి మీరె
మహితమూర్తి కందుకూరి
అతనిగూర్చి నే పలికెడి
అతిశయమే యెఱుగని నుడి
ఒకసారి వినుమన్నా!
ఓహోహో తెలుగన్నా!
సంఘానికి ఎదురీది
సంస్కార పతాకదాల్చి
పూర్వమార్గ ప్రియులచేత
ఓర్వలేని కోత లంది
నలుబది గ్రీష్మాలక్రితం
నడచిపోయె జగతినుండి
అతని దివ్యస్మరణకొరకు
అశ్రుధార విడుమన్నా!
ఒకసారి వినుమన్నా!
ఓహోహో తెలుగన్నా!
ఈస్ఫటిక శిలాసమాధి
ప్రస్ఫుట నవసమాజ వీధి
కందుకూరి కల్యశేష
మందినట్టి దివ్యభూష
నిండుమనసుతో వెడలి
ఒకసారి దర్శింపుము
ఒకసారి కనుమన్నా!
ఓహోహో తెలుగన్నా!
భావితరము మఱువరాని
భవకవివే నీవైతే
యువజాతిని కదలించే
నవగీతము నీవైతే
కన్నీటిని చిందించే
కారుణ్యమె నీవుంటే
పతితాళిని కాపాడే
పవిత్రభావన నీవైతే
ఆగీతాలా వనకై
ఆత్మార్పణ చేసినట్టి
ఆప్రగతీ సాధనకై
ఆమరణము పోరినట్టి
ఆకరుణా దీవనకై
ఆదర్శము చూపినట్టి
ఆభావ ప్రకటనకై
అమరసేవల జేసినట్టి
కందుకూరి అమరకీర్తి
కంఠమెత్తి పాడుమన్నా!
ఓహోహో తెలుగన్నా!
ఒకసారి పాడుమన్నా!!



వీరేశలింగంగారు రాజమండ్రిలోని ఇన్నీసుపేటలో నిర్మించిన హైస్కూలు.



వీరేశలింగంగారు చెన్నపురిలో నిర్మించిన సంఘ సంస్కార సమాజ మందిరం.

నవయుగ వైతాళికుడు వీరేశలింగం

[3వ పేజీ తరువాయి]

అత్యంతమైన ఖ్యాతి నన్నింటినీ ధిక్కరించి తన పట్టుదలను, విజయాన్ని చేకూర్చుకొన్న సాహసు డాయన.

ఎటువంటివానిపైనా, అవి అన్యాయమైనంత మాత్రాన ఎదురించగల ధైర్యవంతుడాయన. ధైర్యానికితోడు ఆయన ధారణశక్తికి అంతా ఆశ్చర్యపోయేవారు.

తాను నిద్రిస్తున్న మంచం ప్రక్కనే ఆయన పెదతండ్రిగారు, ఒక స్నేహితుడు జిల్లా మునసబు పరీక్షలకోసమని రాత్రిళ్ళు అధ్యయనం చేసేవారు. వారి పుస్తకాలలోని విషయాలను ఆయన ప్రక్కనుండి వినినంతమాత్రాన అప్పజెప్పగలిగేవాడు.

ఇది చదువా? నూటికి 88 మార్కులకు ఏ నాడూ ఆయన తక్కువ తెచ్చుకోలేదు. నేటి విద్యార్థులు ఆయన విద్యార్థి జీవితాన్ని చూచి నేర్చుకోతగినది ఎంతైనా వుంది.

ఆయనకు పన్నెండవ ఏటనే రాజ్యలక్ష్మీదేవిగారితో వివాహమైంది. ఆ వివాహానికి పెద్దల బలాత్కారాన, భోగంమేళం పెట్టగా అంత చిన్న వయసులోనే "ఛీ! ఛీ! పవిత్ర శుభకార్యాలలో కులటాంగనల ప్రమేయమా!?" అని చీదరించుకున్నారు.

ఆయన చీదరించుకున్న వందేండ్లకుగాని మన ప్రభుత్వాలకు జ్ఞానం కలుగలేదు. ఇప్పుడు గాదా, భోగంమేళాల నిషేధమన్నారు. అయితే ఆ నిషేధాజ్ఞమాత్రం కొనసాగడంలేదు. ప్రతీ దేవుడి కళ్యాణంలోను, యీ మేళాలే. దేవుని దర్శించడానికి గాక, జనం యీ వేశ్యలను దర్శించడానికే వస్తున్నారనడానికి సందేహం లేదు.

ఆయనకు స్కూలు చదువుపైననే గాక తెలుగు సాహిత్య పఠనాన్ని విశేషశ్రద్ధ కనపరచేవారు. బడిజీతమిస్తే ఆ జీతాన్ని బడికి కట్టక "వసు చరిత్ర" కొనుక్కొని చదువుకోడం మొదలు పెట్టారు. ఉద్రేకాలలో ఇటువంటి పనులు చేసినందుకు, చిరకాలం బాధపడేవారు. ఎంత గ్రంథతృష్ణ.

నవ్యభావాలు

రానురాను ఆయనలో పాత పురాణాలపై విశ్వాసం సడలిపోయి శాస్త్ర విజ్ఞానంపై మక్కువ ఏర్పడసాగింది. మతం, నీతి లోకోపయోగపడాలని వాంఛించేవారు. అందుకని "బ్రహ్మ సమాజం" ప్రవేశించారు. ఆరోజుల్లో ఒక మీటింగుకు వెళ్ళడమంటే, ప్రజలదృష్టిలో "అరరే! మీటింగురాయుళ్ళు" అని అపహాస్యం పాలుకావడమే. అస్థితిలో కూడా, చుట్టూ గూడుకట్టుకొనివున్న అంధకార నిర్మూలనకు ఆయన కాంతి రేఖలా మెరిసేవారు. అజ్ఞానులకు దారిని జూపేవారు.

ఆయన అనుకోకుండా 1869లో సర్వకళాశాల పరీక్షలో తప్పారు. దానిపై తీవ్రమైన జబ్బు! అవన్నీ ఆయనను స్వతంత్ర జీవనంవైపునకు మళ్ళించాయి.

అప్పటికి అచ్చతెనుగులో ఒక కావ్యం, శ్లేష కావ్యమొకటి, నిర్వచన కావ్యమొకటి ఎవరో రచించారు. ఈ మూడు లక్షణాలను, త్రివేణిసంగమంలాగ ఒకే కావ్యంలో మళ్ళించాలని ఆయన చిన్నతనంలోనే సాహసమైన ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్నం ఫలించింది. దాని ఫలితంగా తెలుగు ప్రజలకు "శుద్ధాంధ్ర నిరోష్ఠ్య, నిర్వచన నైషధ" కావ్యం కానుకగా లభించింది.

విద్యార్థిదశనుండి, స్వతంత్ర జీవన మార్గానికి పయనిస్తున్న ఆ మహనీయునికి ఉపాధ్యాయ పదవి 1871లో మొదటిసారిగా లభించింది. జంకూ గొంకూ లేకుండా ఆయన ఉద్యోగాన్ని నిర్వహించేవారు.

ఆ సమయంలో శ్రీ వేమారామమూర్తిగారు ఆయన సహోపాధ్యాయులు. ఆయన తమ్ముడు కృష్ణమూర్తిగారు, మన పంతులుగారి క్లాసులో విద్యార్థి. మూర్తిగారంటే అందరికీ భయం! ఆయన తమ్ముడైనప్పటికి అవిధేయ ప్రవర్తనమూలంగా బల్లమీద నిలబెట్టేశారు. అప్పుడొక ఉపాధ్యాయుడు ఆయనను ప్రక్కకు పిలిచి ఆ విద్యార్థి "రామమూర్తిగారి తమ్ముడు!" అని చెప్పారు. "అవును. నాకెరుగుదును" అని పంతులుగారు నిర్భయంగా చెప్పి క్లాసులోకి వచ్చివేశారు. ఈ నిర్మోహమాటం కారణంగా రామమూర్తిగారిచే ఆయన అభినందన లందుకున్నారు.

నిర్మోహమాట ప్రవర్తకునికి ఎప్పటికైనా భూషణాలు రాకతప్పవని యిది రుజువు చేస్తున్నది.

స్త్రీ జాతి దైన్యస్థితి

1874లో పంతులుగారు మొట్టమొదటిసారిగా హెడ్ మాస్టరు అయ్యారు. బాల్యంలో, యౌవనంలో ఆయనకు అంకురించిన ప్రబలభావాలూ సంద్రంలో బడబాగ్నివలె మరుగుతున్నాయి. సమాజంలో అట్టడుగున పడి నలిగిపోతున్న స్త్రీజాతి ఆయన కళ్ళముందు, దుర్భరయాతనలు పడుతున్న భూదేవతల్లా కనబడ్డారు. అదే రోజున శ్రీ కొక్కొండ వెంకటరత్నం పంతులుగారు మూలనున్న చీపురుకట్టలా పడివుండవలసిన స్త్రీకి విద్య అనవసరమని, అమె సంతానానికి, సేవకు తప్ప ఎందుకూ ఉపయోగపడకూడదని వాదనను లేవదీశారు.

"ఉపయోగ పడడమనే భావన తలంపులకే" సరస విరుద్ధమైన మన వీరేశలింగంగారు, ఆ వాజు పట్టిన వాదనలపై తిరుగబడ్డారు. ఆయన హృదయంలో పట్టుబడిన ఆవేశం, తరంగతరంగాలుగా వ్యాసాల రూపంలో పత్రికల్లో వెలువడసాగాయి. ఆ వ్యాసాలలో శ్రీ కందుకూరిలో యుగపురుషుని లక్షణాలు గోచరించాయి.

వ్యాసాలతో ఆయన ఆత్మకు శాంతి చేకూరలేదు. 1874లోనే రాజమండ్రిలో "వివేక వర్ధని" పత్రికను స్థాపించారు.

దాని ఆశయాలు లంచగొండితన నిర్మూలనం, వేశ్యావినాశనం, భాషాభివృద్ధి, స్త్రీ విద్య ప్రధానమైనవి. "స్త్రీ విద్యా స్త్రీ విద్యా" అని పొలికేకలు కావు- ఆయన చేసినవి. కంఠమెత్తి ఆయన ఘోషించినప్పుడు ఆకాశంలో నక్షత్రాలు అదిరిరాలేవి.

ధవళేశ్వరంలో తన సిద్ధాంతాన్ని ఆయన ఆచరణలో పెట్టారు. బాలికా పాఠశాలను పెద్దలచే నిర్మింపజేశారు. ఆంధ్రమహిళా ప్రపంచానికి అది మరువరానిరోజు. అదే సమయంలో రాజమండ్రిలో వేశ్యాపాఠశాలలు నడిచేవి. ఎంతదుర్మార్గం. అవి ఒకందుకు మంచికే ఇచ్చాయేమో! మన యుగపురుషునిచే అవి "హాస్యసంజీవిని" పత్రికను స్థాపింపచేయించాయి. సాంఘిక దురాచార నిర్మూలన ధ్యేయాన్ని మారి పంతులుగారు వీరవిహారం సాగించారు. చీకటి చాటున ముసుగులు వేసుకొని వేశ్యాగమనం చేసే విటులను తూర్పారబట్టారు. ఈ వేశ్యాపాఠశాలలను ఎత్తివేయుటకు రాత్రింబవళ్లు పనిచేశారు. వాటి స్థానంలో సరయోజన విద్యా పాఠశాలలను నిర్మించారు. తానే పగలు ఇక్కడ పాఠశాలల్లోనూ, రాత్రులు ఆ పాఠశాలల్లోనూ విద్యాబోధన చేసేవారు. అంతే - నీటిలో ఉప్పురాళ్లా వేశ్యాపాఠశాలలు అంతరించిపోయాయి. సమాజానికి పాఠశాలలు మిగిలాయి.

ఇన్నీస్ పేట మెయిన్‌రోడ్డులో వీరేశలింగంగారి శిలావిగ్రహం.

లంచగొండితనంపై పోరాటం

లంచగొండితనంపై ఆయన సాగించిన పోరాటం ఇప్పటికీ మనకు ఆదర్శప్రాయమే. పూర్వం చక్రవర్తులు దొంగతనాలను పట్టుకోడానికి రాత్రుల్లు మారువేషాలలో తిరిగేవారట. లంచగొండితనం పట్టుకోడానికి సరిగ్గా పంతులుగారు అలాగే తిరిగారు. పట్టుకొని పూనుకోడంలాంటి ఆరంభశూరత్వం ఆయనవద్ద ఎన్నడూ లేదు. అంతుతేలనిగాని ఆయనకు నిద్రపట్టేది కాదు.

1878లో గవర్నమెంటు ప్లీడరు చిత్రపు కామరాజుగారు, మునసబుగారు, శిరస్తదారు వీరిముగ్గురు, లంచం తిని, ఒక మహమ్మదీయుని తీర్పును తారుమారుచేసి వేశారు. లంచంతిని వారు మొదట తయారుచేసిన తీర్పును ముక్కలుచేసి బయటికి పారవేశారు. ఆ ముక్కలను ఏరి, అతికించి వాళ్ళ లంచం తిన్నట్టు రుజువుచేశారు. వారి ఉద్యోగాలు వూడిపోయాయి. చిత్రపు కామరాజుగారు అపకీర్తిని భరించలేక విషంతిని ఆత్మహత్య చేసుకొన్నారు.

ఇలా విరామమెరుగని కృషిని సాగిస్తూనే, పంతులుగారు, ప్రజల ఆత్మ రక్షణానికి ఈశ్వరోపాసన కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. ప్రార్థన సమాజం ఏర్పడింది. నేడు రాజమండ్రి కూరగాయల మార్కెట్టు వద్దనున్న ప్రార్థన సమాజం, అదే దీనిని ఆయన సొంతధనంతో కట్టించారు. తానురాసిన గ్రంథాలద్వారా వచ్చిన ధనంతో, రేయింబవళ్లు, పాఠాలు చెప్పుతుంటూ తాను తినగా మిగిలిన డబ్బుతో దీన్ని నిర్మించారు. ఇప్పుడందులో ఆయన తన జీవితకాలంలో శోధించిన అమూల్య వ్రాత, ముద్రణ, గ్రంథాలెన్నో ఉన్న గ్రంథాలయంవుంది. దీన్నిప్పుడు ఉపయోగించే దాతలేరు. విలువైన కరణాలయాన్ని కంటికి రెప్పలా చూస్తున్న శ్రీ అంకిరాజు [illegible]రావుగారు ఇప్పుడు దీని అభివృద్ధికి విశేషకృషి సాగిస్తున్నారు. దినపత్రికలు తెప్పిస్తారు కాని గ్రంథాలయానికి వచ్చే పాఠకుడు కనబడ్డంలేదు.

నూరేళ్లక్రితం పంతులుగారికి కనబడ్డ అవసరం, నేడు పదింతలు అయినా ఆ అవసరాన్ని ఇంకా అంచనా వేసుకోలేని స్థితిలో వున్నామంటే, ఇదంతా మన మూర్ఖత్వంగాక మరేమవుతుంది?

స్త్రీ విద్యతో ఆగక ఆయన స్త్రీ జనోద్ధరణకు కంకణం కట్టుకున్నారు. ఆ రోజుల్లో స్త్రీని అధోగతి పాల్జేసిన దురాచారాలు, బాల్య వివాహాలను నిర్బంధ వైధవ్యం, వరకట్నాలను నిర్మూలించాలని చాటారు. దీనితో ఆనాటి సనాతనులు అదిరిపడ్డారు.

పునర్వివాహోద్యమం

ఈ సమయంలో, కలకత్తాలో ఒక ఈశ్వరచంద్ర విద్యాసాగరు గారున్నారు. ఇక్కడ పంతులుగారున్నారు. ఈయన ఏకాకి. వితండవాదాలతో పోరాడారు.

పంతులుగారిప్పుడు, భారతదేశమంతా గాలించి 80 స్మృతులను పైగా తెప్పించి, వాటిని అధ్యయనంచేసి, వితంతు వివాహాలపై పండితుల తర్కాలను ఎదిరించారు.

విజయనగరం సభలో రాళ్ళతో కొట్టారు. బ్రాహ్మణులే కత్తులనూరారు. రాజమండ్రి మార్కండేయాలయంలో, మదరాసు చాకలిపేటలో బాహాటంగా ఆయనపై తిరుగబడ్డారు. కులంలో తీసివేశారు. కొట్టడానికి సభకు రప్పించబోయారు. ఆ రోజుల్లో పంతులుగారికి అండదండలు — విద్యార్థులే! అనగా విద్యార్థిలోకమేగాని, విజ్ఞాన శిఖపై నిలువకపోతే, పంతులుగారి ఉద్యమం ఏమయ్యేదో కదా!

విద్యార్థుల సైన్యం: పంతులుగారు సేనానాయకుడు

విద్యార్థుల్లో ఆయన నూతన చైతన్యాన్ని రేకెత్తించారు. వితంతువులను వారే వివాహమాడేలా ప్రోత్సాహం గావించారు వితంతువులకు అవహేళనం చేస్తూ, తెలుగులో మొట్టమొదటిసారిగా "రత్నావళి" నాటకాన్ని రాశారు. ఆయన యీ మధ్య ఎవరో మొదటినాటకం మరొకరు రాసినట్టు ఆంధ్రప్రభలో రాశారు. అది యథార్థం కాదు. మన వీరేశలింగం పంతులుగారే మొదటి నాటకం రాశారు.

ఆయన నాటకం-సాంఘిక ప్రయోజనాల సాధనకు ఒక ఆయుధం గావాలని వాంఛించారు. కళ ప్రయోజనంతో సమేతంగాక, కళకోసమే ఉపయోగపడాలన్న సమ్మకవాదాలు లేకపోలేదు. ఎన్ని వాదాలుంటే ఏం? పంతులుగారి ప్రబల యత్నాలముందు అవన్నీ దూదిపింజలా ఎగిరిపోయాయి.

సనాతనాచారపరుల్లో కంగారు బయలుదేరింది. తమ వితంతు బాలికలకు త్వరత్వరగా జుట్టు తీయించసాగారు. తమ పిల్లలు తమ కళ్ళముందే వ్యభిచారిణులై పతనమైన ఈ పెద్దలు సహించేవారుగాని, వితంతు వివాహాలకు అంగీకరించేవారు కారు.

వితంతువులపాలిటి కల్పతరువై పంతులుగారు నిలిచారు. అన్ని మూలల నుండి, వితంతువులు, తమను రక్షించవలసినదిగా ఉత్తరాలు రాయసాగారు. కృష్ణాజిల్లా తిరువూరులో సీతమ్మ తన వితంతు కూతురు వివాహానికి ఒప్పుకుంది. ఎన్నో భగీరథ ప్రయత్నాలతో రహస్యంగా ఆ పిల్లను రప్పించి రాజమండ్రిలో మొట్టమొదటి వితంతు వివాహం జరిపారు. పెద్ద సంక్షోభం బయలుదేరింది. డి. ఎస్. పి., పోలీసు అధికారులు, న్యాయమూర్తులు సహకరించారు. విద్యార్థులు బాసటగా నిలిచారు.

ఈ పెళ్ళి 1881 డిసెంబరు 11వ జరిగింది. ఇక నాటినుండి. "కులం, సంఘం, భ్రష్టమైన వీరేశలింగంచే సంఘం అపవిత్రం పాలైపోతుంద"ని అలజడి లేవదీశారు. శంకరాచార్యులు అనేకమంది శిష్యులను వెంటబెట్టుకొని, నిత్యం [illegible] ప్రారోగింపులు చేశారు. వాతావరణాన్ని విషకలుషితం చేశారు. అనేకమంది శ్రీముఖాలు వెళ్ళాయి. ఎక్కడివరకో ఎందుకు మొన్న మొన్న మన పార్లమెంటు హిందూ కోడ్ బిల్లును పార్లమెంటులో ప్రతిపాదిస్తుంటే తమ కొంపలు మునిగిపోయినట్టు, కైలాసంనుండి ఎంతమంది సాధువులు క్రిందికి దిగలేదు? అనాడు ఎలా వుండేదో ఈ సంరంభం వూహించుకోవచ్చు. పంతులుగారి శిష్యులకు, శంకరాచార్యులవారి శిష్యులకు అనేక దెబ్బలాటలు జరిగాయి. ఆచార్యుల వారి శిష్యులు అవినీతి ప్రవర్తన కలిగినవారు. వీరి అవినీతి ప్రవర్తనను బట్టబయలు చేసి, నగుబాటు పాల్జేసేసరికి వారు మకాం ఎత్తివేశారు.

అంతేకాదు పదింతలు కష్టంతో రెండవ, మూడవ వితంతు వివాహాలు జరిగాయి. 1888లో ఏడవ వివాహం జరిగింది. అప్పట్లో గొడవలు తగ్గాయి. ప్రచండబ్రహ్మభానుడైన శ్రీ పంతులుగారి ముందు యీ వితండవాదుల చిల్లర చిలిపితంపుల మంత్రాన్ని పనిచెయ్యలేదు.

విద్యాసాగర్‌గారు, రనడేగారు పంతులుగారి అకుంఠిత దీక్షను, అప్రతిహత ఉద్యమానికి ప్రశంసించారు.

పురపాలకసంఘ విధుల నిర్వహణ

ఈ వితంతు వివాహాలను కొనసాగిస్తూనే, పంతులుగారు పురపాలకసంఘ విధులను నిర్వహించేవారు. ఆయనకు పేదలంటే అవ్యాజమైన ప్రేమ. తాను విచారణ సంఘంలో సభ్యుడై ఇంటింటి తిరిగి, పేదలకు పన్నులు తగ్గించి వేసి, మెయిన్‌రోడ్డు ఇళ్ళకు పన్నులు పెంచి పురపాలకసంఘానికి ఆదాయాన్ని మరింత పెంపొందింపచేశారు. ఈ పద్ధతి నేడుగాని పురపాలక సంఘాలు అనుసరిస్తే, ఎంత ఆదర్శంగా వుంటుంది. అంతేగాదు; గంజినీళ్ళు రోగులకు పోసే హాస్పిటల్‌కు తనిఖీ చేసేవారు. ఒకసారి హాస్పిటల్ నౌకరు పంతులుగారిని కొట్టడానికి కూడా ప్రయత్నించాడు.

లంచాలు తిని అధికారులు చేసే స్వార్థ ప్రయత్నాలను అడుగడుగునా ఎదిరించారు పంతులుగారు. తమ ఇళ్ళ ముందు దీపాలు వేయించమన్నదాన్ని, లంచాలు తిని, గవర్నమెంటు [illegible] సాగింపచేసేదాన్ని ఒకటేమిటి? సర్వం ఆయన ఎదిరించారు.

"పౌరధర్మ శాసనవిధులు ఒక్క పేదలను మాత్రమే బాధించుచున్నవి. ధనికులు శాసనవిధులనే బాధించుచుండిరి!" అన్నారు వారు.

ఇప్పటికీ ఇది మనకు కళ్ళకు కట్టినట్టు కనబడుతూనే వుంది.

టౌను హాలు - నాడు నేడు

1890 - 1900 మధ్య తన సొంత డబ్బుతో టౌన్ హాలును కట్టించారు. హాలు నిబంధనలను ఆనాడు పంతులుగారు ఇలా నిర్దేశించారు.

1. ఈశ్వరోపాసకులకు ఇది ఉపయోగపడవలెను అని.

(ఇప్పుడిది మద్యపాన పోషకులకు, ధూమపాన పోషకులకు, జూదగాళ్ళకూ ఉపయోగపడుతోంది. పేకాటలు తప్ప, మరేవీ ఇప్పుడిక్కడ జరగడం లేదు.)

సరి మిగతా విధులు చూద్దాం

2. కులమత తారతమ్యం లేకుండా నైతిక, పునరుద్ధరణకు ఇది తోడ్పడవలెను.
3. సురాపానాలు జరగకూడదు.
4. సంఘ సంస్కారాలకు విరుద్ధ సభలు జరగకూడదు.
5. ట్రస్టీలలో క్రైస్తవుడు, మహమ్మదీయుడు, వైశ్యుడు, శూద్రుడు తప్పక వుండవలెను.

అని మచ్చుకు కొన్ని.

కాని యీ టౌన్‌హాలుపై పోలీసులు అప్పుడప్పుడు దాడులు జరపడాన్ని కూడా ఆలోచిస్తే ఇప్పుడది ఎవరికి ఉపయోగపడుతుందో అర్థమవుతుంది.

పంతులుగారి ఆశయాలు, వారి నగరంలో వారి ఉద్యమ కేంద్రంలోనే ఇలా విరుద్ధంగా మారిపోవడం క్షమించరానిది. హితకారిణీ సమాజం పెద్దలు టౌన్ హాలును వెంటనే జూదరుల చేతులనుండి స్వాధీనం చేసుకోవడం ఎంతైనా అవసరం.

పంతులుగారు నిర్దేశించిన సూత్రాలకు పూర్తి విరుద్ధంగా ఇప్పుడిది వుంది ఇంతకంటే దీనిపై వివరించి చెప్పడం అసాధ్యం.

పంతులుగారు తన సొంతడబ్బుతో రాజమండ్రిలో [illegible] నగరాలలో, మదరాసులో వసతిగృహాలు కట్టించారు. అవి నేటికీ ఈశ్వరోపాసకులకు ఉపయోగపడుతున్నాయి. మదరాసులో వితంతువులకోసం ఒక పాఠశాలకూడా నిర్మించారు పంతులుగారు. 1898 పదిహేనవ దేశీయ మహాసభకు అధ్యక్షత వహించినప్పుడు గోవిందరాఘవయ్యరుగారు "దక్షిణ దేశవిద్యాసాగరుడ"ని పంతులుగారికి బిరుదు కూడా నిచ్చారు.

ఇలా సర్వతోముఖ కృషిని సాగించారు పంతులుగారు.

ఇంతకంటే పంతులుగారు సాగించిన మరో ఘనమైన కృషి వుంది.

ప్రజాసాహిత్యానికి నాంది

పంతులుగారు ప్రజాసాహిత్యానికి పునాది వేశారు.

పంతులుగారే మొట్టమొదటి వచన ప్రబంధాన్ని (రాజశేఖర చరిత్రము, 1878) రచించారు. దీనిని ఇంగ్లండులోకూడా [illegible] అన్న పేరుతో అనువదించి విడుదల చేశారు. "లండన్ టైమ్సు" పత్రిక ఎంతో ఘనంగా దీనిని పొగిడింది.

తెలుగులో మొదటి ప్రకృతిశాస్త్రం, మొదటి జీవిత చరిత్రం వీరే రచించారు.

మొదటి తెలుగు అనువాద నాటకం "శాకుంతల" వీరి కలంనుంచే వెలువడింది. వీరి అనంతరం అనేక "శాకుంతల" అనువాదాలు వచ్చాయి. పంతులుగారి అనువాదంముందు అవేవీ నిలువలేకపోయాయి. పంతులుగారి నాటకం అనేక ప్రదర్శనలీయబడ్డమే ఇందుకు వుదాహరణ!

స్త్రీలకు పంతులుగారు రాసిన గ్రంథాలు ఇన్నన్నీ కావు. వారి శతాధిక గ్రంథాలలో స్త్రీలకే ఎక్కువ ప్రాముఖ్యత యిచ్చారు వారి "చంద్రమతి చరిత్రము" (1884) విడుదలయ్యాక, తెలుగు స్త్రీజాతే తమ పేర్లలో "చంద్రమతి" అని చేర్చుకోసాగారంటే అతిశయోక్తి కానేరదు.

ఇన్ని గ్రంథాలు రాసినా, పంతులుగారు....

"నాకు మొదటినుండీ తెలుగు భాషను అభివృద్ధిచేయాలని వుండేది. నా కాలమంతా అందుకు కృషిచేసినా నాకోరిక నెరవేరి వుండేదేమో" అని వాపోయారు.

అక్కరలేదు పంతులుగారు తెలుగు సారస్వతానికి చేసిన సేవ అజరామరంగా వుంటుంది. అసలు సాహిత్యంలో నవయుగానికి పంతులుగారే నాందీప్రస్తావన చేశారు.

అవిశ్రాంతమైన, సమగ్రమైన "ఆంధ్ర కవుల చరిత్రములు"ను పంతులుగారు మనకిచ్చారు.

అందులో పంతులుగారి కృషి, విజ్ఞత, పరిశోధన ఎన్నో మనకు గోచరిస్తాయి.

దిట్టకవి నారాయణకవి గురించి చెబుతూ, బొబ్బిలియుద్ధం, ఫ్రెంచి సామ్రాజ్యవాదుల కుట్రతంత్రాలవల్లే జరిగిందిగాని విజయరామరాజు కుట్రలవల్ల కాదని సామ్రాజ్యవాద వ్యతిరేకతను స్పష్టంగా ఎత్తిచూపారు.

ఇలా ఎన్నో వున్నాయి. ఎత్తిచూపాలంటే—తెలుగుభాషామ తల్లికి అదొక మణిభూషణమే.

గుప్తప్రభువుల [illegible]లను తూర్పారబడుతూ ఆయన స్వదేశీ సంస్థానాల చరిత్రకూడా రాశారు.

నిర్విరామమైన కృషి సాగించి, లోకోత్తములై, లోకోద్ధరణ గావించి, ఆ మహానుభావుడు కడకు 1919 మే 27వ తేదీని కన్నుమూశారు.

తెలుగుప్రజలపై నున్న భారం

కన్నుమూసేముందు ఆ మహానుభావుడు తన భారాన్ని తన తెలుగు జనులపైననే వుంచారు.

"ఓ యాంధ్ర మహాజనులారా! సంఘ సంస్కారాభిలాషులారా! మా రవంత సత్కాల సంధాయకమైన సాంఘిక సంస్కారవల్లరీ పోషణ భారమునువహింపుడు. నేనిప్పుడు తొంటి జవసత్వములను గోలుపోయి, వేదపడిన వాడనయి, దేశ మాతృసేవనమున కసమర్థమైన దురవస్థలో నున్నాడను. మీ పేదసోదరునికి విశ్రాంతి నిచ్చి, మీరా భారమును స్వశక్తిగా ధరింపుడని, ఆంధ్రమాత తన ప్రియపుత్రులైన మిమ్ములను వేవిధముల వేడుచున్నది. మాతృసేవాతత్పరులైన మీరు తదాజ్ఞను శిరసా వహింతురుగాక!"

ఆయన తుది సందేశమిది

ఆభారాన్ని మోయగలమని యీ 27వ తేదీని శపథంచేసి యుగపురుషుడు వీరేశలింగం పంతులుగారి ఆత్మశాంతిని చేకూరుద్దాం! ఈ జ్వాల నవ్యాంధ్ర నిర్మాణానికి సాగిపోదాం.

జై ఆంధ్ర!

వీరేశలింగం దంపతులు

వీరేశలింగం దంపతుల సమాధులున్న రాజ్యలక్ష్మి నివాసం: ఈ సమాధులపై చలువరాతి పలకలు లేకుండాపోయాయి.

రాజమండ్రిలో నాటి ప్రార్థనామందిరం - నేటి టౌన్‌హాలు.

వీరేశలింగం వర్ధంతి నాడు రేడియో కార్యక్రమాలు

విశాలాంధ్ర పత్రిక సంపాదకులు శ్రీ కాట్రగడ్డ రాజగోపాలరావుగారు "వీరేశలింగం-సంఘ సంస్కరణ" అనే విషయంపై మే27వతేదీ మధ్యాహ్నం 12-30 గంటలకు ఆలిండియారేడియో విజయవాడ కేంద్రం నుండి ప్రసంగిస్తారు.

రాత్రి 9-30 గంటలకు శ్రీ బందా కనకలింగేశ్వరరావుగారు రచించిన "వీరేశలింగం" రూపకం ప్రసారం చేస్తారు.

వీరేశలింగం దంపతుల స్మారకచిహ్నాల శోచనీయ స్థితి

రాజమండ్రి, వీరేశలింగంతోటలోని రాజ్యలక్ష్మి నివాసంలో పంతులుగారి సమాధి, వారి సతీమణి రాజ్యలక్ష్మమ్మగారి సమాధి నిర్మించబడి ఉన్నాయి. రాజ్యలక్ష్మమ్మగారు 1910లో అంటే పంతులుగారు మరణించడానికి తొమ్మిది సంవత్సరాలు ముందుగా రాజమండ్రిలో మృతి చెందారు వీరేశలింగంగారు తన భార్య సమాధికి పాలరాతి పలకలను కలకత్తా నుండి తెప్పించారు. చుట్టూ రాజ్యలక్ష్మి ప్రమోదా వనమని పూలతోట వేశారు. వీరేశలింగంగారు 1919లో మద్రాసులో కీర్తిశేషులయ్యారు. పంతులుగారి కోర్కె ప్రకారం 'రాజ్యలక్ష్మీ నివాసం'లోనే ఆయన సమాధి నిర్మించబడింది. ఇది కూడా చలువరాతి పలకలతోనే నిక్షేపించారు.

ఆంధ్ర జాతీయ పునర్వికాసానికి మూలపురుషుడైన వీరేశలింగంగారి దివ్య స్మృతికి చిహ్నంగా ఉన్న వాటిలో ఈ సమాధులు ఎంతో ముఖ్యమైనవనుట నిస్సందేహం. ఈ యుగపురుషుడు నిర్మించిన మహత్తర సాంఘిక సంస్కరణోద్యమాన్ని భావి తరాల వారికి గుర్తుచేసే అమూల్యనిక్షేపాలివి.

కాని దురదృష్టవశాత్తు ప్రస్తుతం రాజ్యలక్ష్మినివాసము, అందులోని సమాధులు చాలా శోచనీయ స్థితిలో ఉన్నాయి. సమాధులపైఉన్న చలువరాతిపలకలను ఎవరో ఒలుచుకుపోయారు. రాజ్యలక్ష్మి నివాసం వైపు ప్రహరీమీది ఇనుపగేటు కూడ ఎత్తుకుపోయారు. చుట్టూ ఎట్టి రక్షణలేదు. రాజ్యలక్ష్మినివాసం పేకాటకు, దేవాదికి నిలయంగానూ, గోడలు అసహ్యచిత్రాలకు ఆలవాలంగానూ తయారైనాయి. ప్రస్తుతం ఈ స్మారకచిహ్నాలున్న తోటభాగం ప్రభుత్వాధీనంలో ఉంది హితకారిణీ సమాజం వారి ఆధీనంలోలేదు ప్రభుత్వ యాజమాన్యాన నడిచే మహిళాసంక్షేమ సంఘంవారికి కౌలుకివ్వబడింది. ఈ స్మారకచిహ్నాలు దుస్థితిపాలు కాకుండా ఏ ఒకరూ శ్రద్ధతీసుకోలేని విషమ పరిస్థితి ఏర్పడింది.

ప్రభుత్వం వెంటనే కళ్ళుతెరిచి, ఈ స్మారక చిహ్నాలను రక్షించడానికి, పునరుద్ధరించడానికి పూనుకోవాలి. ఆంధ్ర ప్రజలకు జాతీయ క్షేత్రాలుగా ఉండవలసిన ఇటువంటి చారిత్రక కట్టడాలను శిథిలం కాకుండా చూడాలి, అందుకు ప్రజలుకూడా ఆందోళన చేయడం అవసరం.



సంస్కరణ వివాహాలు జరిపించిన కల్యాణ మంటపం.

హైద్రాబాద్‌లో వీరేశలింగం వర్ధంతి సభ

హైద్రాబాద్, మే 26

హైద్రాబాద్ నగరంలో శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులుగారి వర్ధంతి ఈ క్రింది కార్యక్రమం ప్రకారం జరుగుతుందని శ్రీ సురమౌళిగారు వ్రాస్తున్నారు.

మే 27వ శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంలో సాయంత్రం 6 గంటలకు సంస్కరణ వివాహాలు చేసుకున్న దంపతుల గ్రూపు ఫొటో. ఆరు గంటలకు అక్కడే బహిరంగ సభ జరుగుతుంది. అధ్యక్షులు: శ్రీ గాడేపల్లి సూర్యప్రకాశరావుగారు, సంస్కరణ వివాహాలు చేసుకున్న దంపతులకు సన్మానం జరుగుతుంది. రాత్రి ఎనిమిదిన్నర గంటలకు - విద్యానగర్‌లో సంస్కరణ వివాహాలు చేసుకున్న దంపతులు సంస్కరణాభిలాషులూ కలిసి ఒక సామూహిక విందులో పాల్గొంటారు.

విజయవాడలో

విజయవాడలో విజయ సాహితీ సమితి ఆధ్వర్యాన వీరేశలింగం వర్ధంతి సభ సాయంత్రం 6 గంటలకు ప్రజాశక్తి నగర్ కళాశాలా భవనంలో జరుగుతుంది.

వీరేశలింగం చూపిన ఆదర్శం అనుసరించాలి

(3వ పేజీ తరువాయి)

క్రమముగ సంతువ్యాధివలెనన్ని జాతులలోకివ్యాపించినది. ధనమున్న పక్షమున ధర్మకార్యములు చేసి సంఘ [illegible] నేర్పరచి చేయవలసిన పనులెన్ని యేని కలవు. అంతియే గాని యాదవదరి భాగ్యవంతులై [illegible]నములో తులతూగుచున్న పెండ్లికొడుకులకు వివాహకాలమున మంగళస్నానములతో పాటు కనకాభిషేకము చేయుట శ్రేయస్కరము గాదు. గుణవంతులైన దరిద్రుల పెండ్లికొడుకులను వచ్చి యాచించిన వరునికి కట్నముగానిచ్చి పిల్లనిచ్చిన పక్షమున నట్టిదంపతులు చిరసౌఖ్యము నందుదురు.

సాంఘిక సంస్కరణ సభలు జరపండి

ప్రాచీనకాలమునుండి మన హిందూ సంఘమున నెన్నో సంస్కరణములు జరిగినట్లు మన మత గ్రంథములలో నుండినను వాటిని లెక్కచేయక మహా పండితులు సయితము పామరులట్లే మూఢ విశ్వాసములకులోనై "గతానుగతికో లోకోనలోకః పారమార్థికః" యను లోకోక్తిని బట్టి వారు చేయుచున్నారని మేము, మేము చేయుచున్నారని వారు ఇటువంటి పుంతనే పోవుచున్నారు. సంఘసంస్కరణ విషయమునందు మునుపటి వలె ప్రబోధముగాదలేదు. పూర్వము రాజకీయ విషయమున జేనేట జిల్లా సభలు జరుగుచుండెడివి. కొంత కాలమునుండి రాజకీయ సభల మాటటుండగా సంఘ సంస్కరణ సభలు లేవు. ప్రతి మండలములోనున్న నాయకులు ప్రతిసంవత్సరము జరిపి ప్రచారము చేసిన బాగుండును. రాజకీయ విషయములు పౌరతనము వారి యాధీనములోనివి. సాంఘిక విషయములు మన చేతిలో నున్నవే గనుక, మనము వాటిని చక్కపరచుకో వలెను.

వీరేశలింగంగారు బెంగుళూరులో నిర్మించిన బ్రహ్మసమాజ మందిరం.

జమ్మి వారిని సంప్రతించండి

పిల్లల లివర్ & స్ప్లీన్ వ్యాధుల నివారణకు ప్రత్యేక నిపుణులు

లివర్ వ్యాధికి తొలిసూచనలు — తరుచుగా అజీర్తి చేయుటం, తెలుపు విరేచనాలు, ఆకలి లేకపోవటం, పొట్ట ఉబ్బరం మున్నగునవి కనిపించగానే ఇక ఏమాత్రమైనా ఆలస్యం చేయక జమ్మివారి సలహా పొందండి.

దాదాపు 60 సంవత్సరాల అనుభవంతో జమ్మి వారు ప్రతి సంవత్సరం 10,000 మంది పిల్లలకు పైగా చికిత్సచేయుటం ద్వారా మిళిలేని సేవ చేస్తున్నారు. వారు వ్యాధిని నిర్ధారణ చేస్తారు. వారి చికిత్సా విధానం సాటిలేనిది; వ్యాధిని నిర్మూలిస్తుంది.

జమ్మివారి డాక్టర్ మీ సమీపంలోగల పట్టణానికి ప్రతినెలా వస్తారు. ఆయన పర్యటన కార్యక్రమంకొరకు వ్రాయండి.

జమ్మివారి

లివర్‌క్యూర్

పిల్లల లివర్, స్ప్లీన్ వ్యాధులకు

జమ్మి వెంకటరమణయ్య అండ్ సన్స్

బ్రాంచీలు: నెం. 17/283 హిందీ పేట, గాంధీనగరం - విజయవాడ - 2

ఒరుగంటివారివీధి, విజయనగరం. 132/1 మహాత్మాగాంధీరోడ్, ఏలూరు:

పాప్లిన్స్

షర్టింగ్స్

నూలుపట్టు ధోవతులు

ప్రింటెడ్ వాయిల్స్

రవ సెల్లాలు

SANFORIZED REGISTERED TRADE MARK

రైపూర్ మిల్స్ లిమిటెడ్,

అహమదాబాద్

అతి సరళమైన ఒకే పద్ధతి అంతటా అమలు జరుగుతుంది

అతి సరళమైన తూకాలు, కొలతల పద్ధతి దేశమంతటా ప్రవేశపెట్టే యత్నం మరికొంత ముందుకు సాగింది.

రాష్ట్రాలలోను, కేంద్ర పాలిత ప్రాంతాలలోను ఎన్నిక కొన్ని ప్రదేశాలలో 1958 అక్టోబరు 1వ తేదీ నుండి మెట్రిక్ పద్ధతి తూకాలు ఉపయోగించబడుతున్నాయి. ఈ ప్రదేశాలలో వచ్చే అక్టోబరు నెలనుండి మెట్రిక్ తూకాలు మాత్రమే వాడుతారు.

1960 ఏప్రిలు నెలనుండి ఒక్క జమ్మూ-కాశ్మీరులో తప్ప, అన్ని రాష్ట్రాలలోనూ మెట్రిక్ తూకాల వాడకం ప్రవేశపెట్టారు.

1962 ఏప్రిలు నాటికల్లా దేశమంతటా మెట్రిక్ తూకాలు వాడకం నిర్బంధమవుతుంది.

మెట్రిక్ పద్ధతి

అంతటా ఒకే పద్ధతి - ఎంతో సులభమైనది

భారత ప్రభుత్వం వారిచే జారీ చేయబడినది.

DA 60/66

కావలెను

శ్రీ శారదా హైస్కూలులో పని చేయుటకు

ఈ క్రింది పోస్టులకు 9-6-60 లోగా దరఖాస్తులు కోరబడుచున్నవి దరఖాస్తు కాపి శ్రీ నరసరావుపేట జిల్లా విద్యాశాఖాధికారి గారికి, పంపవలెను.

పోస్టులు

1 లెక్కలు బి. ఇ. డి.
1 సైన్సు బి. ఇ. డి.
1 సోషల్ బి. ఇ. డి.
1 1వ గ్రేడు తెలుగు పండితుడు.
1 2వ గ్రేడు తెలుగు పండితుడు.
2 హయ్యర్ టి. టి. సి. సీనియర్ టీచర్సు
2 హయ్యర్ డ్రిల్లు మాస్టర్లు.
1 హయ్యర్ టి. టి. సి. డ్రాయింగు మాస్టరు.

జీతం: జిల్లా పరిషత్తు ననుసరించి ఇవ్వబడును. + మామూలు డి. ఎ. పోస్టులు టెంపరరీ అయితే ఖాయమగును.

మరి: అనుభవమున్న బి.ఇ.డి.ని హెడ్మాస్టరుగా తీసికొనబడును.

టి. వి. రాఘవులు, కరస్పాండెంటు.
శ్రీ శారదా హైస్కూలు &
ట్రైనింగ్ స్కూలు,
చిలకలూరిపేట.

ప్రకటన

గవర్నమెంటు ట్రైనింగ్ కాలేజి, నెల్లూరు 1960-61 సంవత్సరమునకు క్రాఫ్ట్స్ ట్రయినింగ్ కోర్సునకు ప్రవేశములు.

నెల్లూరులోని గవర్నమెంటు ట్రయినింగ్ కాలేజిలో 1960-61 సంవత్సరమునకు క్రాఫ్ట్సుట్రయినింగ్‌లో వీవింగ్, చెక్క పని, మరియు బుక్ బైండింగ్ కోర్సులకు దరఖాస్తులు కోరబడుచున్నవి

వీవింగ్: 1 సంవత్సరం
చెక్క పని: 2 సంవత్సరములు
బుక్ బైండింగ్: 1 సంవత్సరం

ఈ కోర్సులు ఇదివరకెన్నడూ ట్రయినింగ్ పొందనివారికి మాత్రమే. పై ఏదైనా కోర్సులోనైనా ప్రవేశమునకు కనీసము ఎస్. ఎస్. ఎల్. సి ప్యాసై యూనివర్సిటీ కోర్సులలో ప్రవేశార్హత కలిగి యుండవలయును లేదా దానికి సమానార్హత కలిగియుండవలయును. ప్రవేశార్హతగోరు అభ్యర్థులు, దరఖాస్తుఫారములకు ప్రిన్సిపాల్‌కు వ్రాయవలయును. తిరిగి పూర్తిచేసి 20-6-60 తేదీలోగా ప్రిన్సిపాల్ గవర్నమెంటు ట్రయినింగ్ కాలేజి, నెల్లూరుకు పంపవలయును. ఆంధ్రప్రదేశ్‌లో నివసించువిద్యార్థులకు ట్యూషన్ ఫీజు లేదు. ఎంచుకోబడిన ఆంధ్ర విద్యార్థులకు నెలకు రు 18/- ల స్టయిఫండు గ్యారంటీ కలదు.

(సం.) గోపాలకృష్ణమూర్తి,
ప్రిన్సిపాల్,
గవర్నమెంటు ట్రైనింగ్ కాలేజి,
నెల్లూరు, 16-5-60.

కార్పొరేషన్ ఎన్నికలలో ప్రతిపక్షం పట్ల వివక్ష

ఒకేఒక ప్రతిపక్షపార్టీ అయిన ఐక్యపౌరసమితికి ఎన్నికలగుర్తు ఇవ్వకుండా కమిషనర్ నిరాకరణ

హైద్రాబాదు, మే 23

హైద్రాబాదు కార్పొరేషన్ ఎన్నికలలో పార్టీలకు ఎన్నికల గుర్తు కేటాయిస్తున్న సందర్భంలో ఐక్య పౌర సమితి (యునైటెడ్ సిటిజన్స్ కమిటీ)కి ఒక గుర్తును కేటాయించనందుకు నిరసన తెలియజేస్తూ, పార్లమెంటు సభ్యుడు శ్రీ రాజబహద్దూర్ గౌడ్ నేడొక ప్రకటన చేశారు.

శ్రీ గౌడ్ తన ప్రకటనలో ఇలా నిరసించారు:

"ఐక్యపౌర సమితి గత హైద్రాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో 64 స్థానాలకు పోటీ చేసి మొత్తం ఓట్లలో 33 శాతం సంపాదించింది.

అప్పుడు సమితికి త్రాసును ఎన్నికల చిహ్నంగా కేటాయించారు. కాని ఈ ఎన్నికల్లో కమిషనర్ ఈ పార్టీకి ఏ గుర్తును కేటాయించకుండా వదిలేశారు. అందుకు కారణంకూడా తెలియజేయలేదు. ఈ విషయమై అధికారులకు తెలియజేసినప్పటికీ లాభం లేకపోయింది. కార్పొరేషన్‌లో ఉన్న ఒకేఒక ప్రతిపక్షపార్టీ పట్ల ఇలా వివక్ష చూపడం అన్యాయం. ప్రభుత్వం ఈ విషయం పునరాలోచించి, మునుపటి ఎన్నికల్లో "త్రాసు"ను ఐక్య పౌరసమితి ఎన్నికల గుర్తుగా కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నాను."

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం

యం. బి. బి. యస్. డిగ్రీపరీక్షాఫలితాలు

తిరుపతి, మే 26

1960 మార్చి, ఏప్రిల్లో జరిగిన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంవారి యం. బి. బి. యస్. డిగ్రీ పరీక్షల్లో ఈ దిగువ నంబర్లుగలవారు ఉత్తీర్ణులయ్యారు.

యం. బి. బి. యస్. (మొదటి పరీక్ష)

పార్టు 1 (ఆర్గానిక్ మరియు ఫిజికల్ కెమిస్ట్రీ): 2 5 7 9 11 12 14 15.

పార్టు II (మొత్తం పరీక్ష)
మొదటి శ్రేణి: లేదు
రెండవ శ్రేణి: 3 7 12 18 20.
అనాటమీలో మాత్రం ఉత్తీర్ణులు: 8 13 26 నుండి 33
ఫిజియాలజీలో మాత్రం ఉత్తీర్ణులు: 4 5 11 15 24 34 నుండి 40

యం. బి. బి. యస్. (రెండవ పరీక్ష)

పార్టు I (ఫార్మకాలజీ): 41 42 44 నుండి 50 52 53 55 నుండి 57 59 నుండి 65

పార్టు II (మొత్తం పరీక్షలో)
మొదటి శ్రేణి: లేదు
రెండవ శ్రేణి: 67 నుండి 72 74 నుండి 84
ఫారెన్‌సిక్ మెడిసన్‌లో మాత్రం ఉత్తీర్ణులు: 66 78

రాకెట్ ప్రయోగాలు పసికట్టే ఉపగ్రహం

అమెరికాచే ప్రయోగం

వాషింగ్టన్, మే 24

రాకెట్ల ప్రయోగాలను కనిపెట్టి ముందుగా హెచ్చరిక చేయగల ఉపగ్రహాన్ని అమెరికా నేడు అంతరిక్షంలోకి పంపించింది. ఇది అంతరిక్ష కక్ష్యలో ప్రవేశించినదని అమెరికా ప్రభుత్వం ప్రకటించింది.

ఈ ఉపగ్రహం బరువు 5 వేల పౌనులు. ఖండాంతర రాకెట్ల ప్రయోగం భూమిపై ఎక్కడైనా జరిగితే ఆ విషయం వెంటనే కనిపెట్టడానికి అవసరమైన పరికరాలు ఈ ఉపగ్రహంలో వున్నాయట. ఈ ఉపగ్రహాన్ని కేప్ కానావెరాల్ నుండి అంతరిక్షంలోనికి పంపారు.

ఈ ఉపగ్రహం పొడవు 22 అడుగులు, వ్యాసం అయిదడుగులు.

ఖండాంతర రాకెట్లు భూమిని వదలిన కొద్దిసేపటికే ఈ ఉపగ్రహంలోని ఎలెక్ట్రానిక్ పరికరాలు, ఇన్‌ఫ్రారెడ్ కిరణాలద్వారా, ఆ రాకెట్ ప్రయోగింపబడిన విషయాన్ని పసిపట్టగలవు. ఖండాంతర రాకెట్లు పైకి వెళ్ళే సమయంలో ఎంతో వేడి ఉత్పత్తి అవుతుంది. తద్వారా ఆ రాకెట్ ప్రయోగాన్ని గురించి ఈ ఉపగ్రహం తెలుసుకొని ఆ సమాచారాన్ని భూమిమీదగల కొన్ని కేంద్రాలకు అందజేస్తుంది.

ఇది 150-200 మైళ్ళ ఎత్తున భూమి చుట్టూ తిరిగేలా అంతరిక్షంలో ప్రయోగించారు.

అయితే, దీని ప్రయాణమార్గం ఇంకా తెలియరాలేదని, దీన్నిగురించి సమాచారం సేకరించే కాలిఫోర్నియా మొదలగు కేంద్రాలలోని పరికరాలు సరిగా పనిచేయనందువల్ల వెంటనే అవి సమాచారం అందివ్వలేకపోయాయని అమెరికా వైమానిక శాఖ ప్రకటించింది.

జపాను ప్రధానిపై హత్యా ప్రయత్నం

టోకియో, మే 25

ఒక పద్దెనిమిదేళ్ళ యువకుడు ప్రధాని నోబుసుకే కిషీని హత్య చేయడానికి ప్రయత్నించాడనీ, అతనిని అరెస్టుచేశామనీ జపాను పోలీసులు నేడు తెలిపారు. హత్యాప్రయత్నాన్ని ఆ యువకుడు ఒప్పుకున్నాడని తెలిపారు.

ఫైనల్ యం. బి. బి. యస్. డిగ్రీ పరీక్ష

పార్టు 1 (పూర్తి పరీక్ష)

86 నుండి 93 95 96 98.

సోషల్ మరియు ప్రివెంటివ్ మెడిసిన్‌లో ఉత్తీర్ణులు: 94 97.

కమ్యూనిస్టు దేశాలపట్ల భారతదేశ వైఖరిలో మార్పు

అమెరికా విదేశాంగ మంత్రి వ్యాఖ్య

వాషింగ్టన్, మే 25

కమ్యూనిస్టు దేశాలపట్ల భారత ప్రభుత్వ వైఖరిలో వచ్చిన మార్పు చాలా గణనీయమైనదని అమెరికా విదేశాంగ మంత్రి హెర్టర్, అమెరికా ప్రతినిధులసభ అప్రోప్రియేషన్ కమిటీలో విదేశాలకు సహాయం గురించిన ఒక ఆంతరంగిక దర్యాప్తు సందర్భంలో ప్రసంగిస్తూ అన్నారు. టిబెట్‌లో తిరుగుబాటు విఫలమయిన తరువాత, అంతకన్నా ఎక్కువగా సరిహద్దు తగాదా వచ్చిన తరువాత భారత ప్రభుత్వానికే కాకుండా, భారత ప్రజలకు కూడా ప్రగాఢమైన చాల కోపం వచ్చిందని ఆయన అన్నారు.

"భారతదేశం విషయంలో మరొక ప్రోత్సాహకరమైన విషయం కేరళ రాష్ట్రంలో కమ్యూనిస్టులు ఓడిపోవడం" అని ఆయన అన్నారు.

కేరళ ఎన్నికల్లో గెలిచిన పార్టీల సన్నిధిని ఆయన "కన్సర్వేటివ్ గ్రూపుల"ని పేర్కొని, అవన్నీ పెద్ద మెజారిటీని సంపాదించాయన్నారు.

"అయితే ఆ రాష్ట్రంలో కమ్యూనిజం పని అయిపోయిందని అనుకోరాదనీ, నిజానికి అంతకు మునుపటి ఎన్నికల్లో కన్నా కమ్యూనిస్టులకు ఈసారి ఎక్కువ ఓట్లు వచ్చాయనీ ఆయన తెలిపారు.

తన దృష్టిలో దక్షిణ ఆసియా కంతటికీ, చాల ముఖ్యమయిన, ఆశాజనకమయిన పరిణామం, సింధునదీ జలాల పంపకం విషయమై భారత, పాకిస్తాన్ ప్రభుత్వాలకు అంగీకారం కుదురగల అవకాశం ఏర్పడడమే అని హెర్టర్ అన్నారు.

ఆ రెండుదేశాలమధ్య సంబంధాలు బాగుపడడానికి ఈ ఒప్పందం దారి తీయగలదని ఆయన అన్నారు.

ఈ సంబంధాలు బాగుపడడంతో, ఉభయదేశాలూ తమకు ఉమ్మడిగా ఉన్న కమ్యూనిస్టు ప్రమాదాన్ని దృష్ట్యా దానికి రక్షణ విషయంలో కూడా సహకారానికి దారితీయగలదని ఆయన అన్నారు.

వీటన్నిటి ఫలితంగా కాశ్మీర్ సమస్య పరిష్కారానికి కూడ అనుకూల వాతావరణం ఏర్పడగలదని హెర్టర్ విశ్వాసం చెప్పారు.

పాతికమంది సాయుధ నాగా తిరుగుబాటుదార్లు మంగళవారం నాడు అస్సాంలోని శంకపహార్ సమీపంలో ఒక సప్లయి బండిపై దాడిచేశారు. డ్రైవరు, ఒక రైఫిల్‌మాన్ గాయపడ్డారు. ఒక రైఫిల్‌మాన్ చనిపోయాడు.

ఐక్ జపాన్ పర్యటన వాయిదాకు ఆలోచన

టోకియో, మే 25

అధ్యక్షులు ఐసెన్‌హోవర్ జపాన్ పర్యటనను వాయిదా వేయటంగురించి ఆలోచనలు జరుగుతున్నాయని ప్రధాని నోబుసుకె కిషీ తెలిపినట్లు జపాను రేడియో నేడు ప్రకటించింది.

వచ్చే నెలలోనే ఐసెన్‌హోవర్ జపాను పర్యటనప్రారంభం కావలసి ఉంది. కాని, ఇటీవల సోవియట్‌పై అమెరికా గూఢచారి విమానం అత్యాచారం జరిగిన తరువాత, కొత్తగా కుదిరిన అమెరికా-జపాను సైనికరక్షణ ఒడంబడికను హడావిడిగా అమలు జరిపించడానికి జపాను ప్రధాని కిషీ ప్రయత్నిస్తున్న ఫలితంగానూ, జపానులో అమెరికా వ్యతిరేక ప్రదర్శనలు తీవ్రరూపంలో ప్రారంభమయాయి.

ఈ పై మూడు [illegible] పొందుపరచి తనపార్టీ చేసిన తీర్మానం పట్టుకొని కొత్త సోషలిస్టు - డెమాక్రాటిక్ పార్టీ నాయకులు ఈ రోజు మధ్యాహ్నం కిషీని కలుసుకున్నారు.

ఐసెన్‌హోవర్ పర్యటనను వాయిదా వేయడంగురించి ఆలోచనలు జరుగుతున్నాయని చెప్పి, కిషీ, తాను మాత్రం బయటివత్తిడికి లొంగి ఎన్నటికీ రాజీనామాను ఇవ్వనన్నారని జపానురేడియో తెలిపింది.

వేలం నోటీసు

విశాఖపట్నం జిల్లా కోటవురట్ల పెదపల్లిపాలెం, చింతపల్లి గ్రామములలోయున్న శ్రీ విజయనగర మహారాజావారి తేలంపాటు లంకలు, పీక పాలు కాయ్య పెంపకాలు, ఒక సంవత్సరమునకు; ఫసలీ 1870కి 1960 వ సం॥ జూన్ నెల 10 వ తేదీన పగలు 11 గంటలకు లో 13 వ క్లైమ్‌లో పి.డబ్ల్యు.డి. ఇన్‌స్పెక్షను బంగళాలో వేలం వేయబడును

వేలం షరతులున్నూ, వేలంకు యున్న ప్రకుల వివరములున్నూ, కోటవురట్లలోని రివిన్యూ ఇన్‌స్పెక్టరు ఆఫీసులో తెలిసికొనవచ్చును.

(Sd) జి. ఎస్. ఎన్. రామమూర్తి
రిసీవరు బి. ఏ. బి. యల్.
జాయింటు ఫ్యామిలీ ప్రోపర్టీస్ ఆఫ్
రాజా ఆఫ్ విజయనగరం.
in os 120/48 of Sub-court
Visakhapatnam (ఫోర్త్)
విజయనగరం 21-5-60





ఎల్లప్పుడూ ముందే

తమ పనికి సంబంధించినంతవరకు లేతులు మెషిన్ టూల్సు ఉత్పత్తి చేయుటలో ఎప్పటికప్పుడు నూతనంగా ఉద్భవించే అభివృద్ధిని తమలో మేళవించుకొని వుంటాయి. లేతులు, టూల్సు అన్ని వేళల కాలానుగుణ్యంగా పెద్ద చేయబడి ప్రిసిషన్‌తో నిర్మించబడి, వాడుకలో మన్నిక నిచ్చును. భారత ప్రభుత్వ పరీక్ష శాలలో పూర్తి పరిశోధన జరిపిన తర్వాత వానిని మొదటి శ్రేణిలోవుంచి యున్నారని చెప్పుటలో ఆశ్చర్యము లేదు. లేతులు, టూల్సు గురించి మీకు అవసరమైన పూర్తి వివరాలనన్నిటిని, మీకు అందజేయగలము.

తయారు చేయువారు:

ది మైసూరు కిర్లోస్కర్ లిమిటెడ్, యంత్రపూర్ పోస్టు, హరిహర

సోల్ ఏజెంట్లు: బాట్లీబాయ్ (ప్రైవేట్) లిమిటెడ్,

సిల్వర్ జూబ్లీ పార్క్‌రోడ్, బెంగుళూరు - 2

సబ్ ఏజెంట్లు: బాట్లీబాయ్ & కో., విజయవాడ, అహ్మదాబాద్, బొంబాయి, కలకత్తా, కోయంబత్తూరు, ఢిల్లీ, కాన్పూర్, మద్రాసు, సికింద్రాబాద్.

మీ సుందర మూర్తి ఆకర్షణీయంగా వుంటే

కన్నులకింపైన వశీకర దృష్టియే!

LUX

LTS. 45-X52 TL

హిందూస్థాన్ లీవర్ తయారీ

ప్రభుత్వోద్యోగుల ప్రదర్శనలు

(మొదటి పేజీ తరువాయి)

యన్. ఆవరణలోను, సికింద్రాబాద్ రైల్వే వర్క్‌షాపులోని యూనియన్ ఆవరణాలోను పెద్దసభలు, రెండునగరాల ముఖ్యవీధుల్లో ఊరేగింపులూ జరిగాయి. వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు సభల్లోనూ, ఊరేగింపుల్లోనూ పాల్గొన్నారు.

పూనాలో 10 వేల మంది ఊరేగింపు

పూనాలో 10 వేలమంది ఉద్యోగులు ఊరేగింపు జరిపారు. ఆ తరువాత శివాజీ మార్కెట్ వద్ద పెద్ద సభ జరిగింది. పార్లమెంటు సభ్యులు శ్రీ ఆర్. కె. ఖాడిల్కర్ ప్రసంగిస్తూ ఉద్యోగులందరు ఐకమత్యంతోనూ శాంతియుతంగానూ తమ హక్కులను రక్షించుకోవాలని కోరారు.

శ్రీ యస్. జి. గోరే (పార్లమెంటు సభ్యుడు) అధ్యక్షతన మరొకటి కూడ ఉద్యోగులు సభ జరిపారు.

కలకత్తాలో

అఖిలభారత కోర్కెలదినం సందర్భంలో నేడు కలకత్తాలోనూ, శివార్లలోను కేంద్ర ప్రభుత్వోద్యోగులు ప్రదర్శనలు జరిపారు. ఈ ప్రదర్శనం ఫలితంగా కలకత్తాలోని విస్తృత ప్రాంతాలలో రాకపోకలు రెండు గంటలసేపు నిలిచిపోయాయి.

నగరంలోని వివిధ ప్రాంతాలనుండి ఊరేగింపులు బయలుదేరి సభా ప్రదేశానికి చేరాయి. ఆఫీసు పనిగంటలు అయిపోయిన వెంటనే అనేక మంది మహిళలతోసహా తమతమ కార్యాలయాల ఎదుట గుమిగూడి తమ సంఘ ధ్వజాలు, నినాదాల పోస్టర్లు చేతబట్టి కొని మైదాన్ వద్దకు ఊరేగింపులు ప్రారంభించారు.

రైల్వే కార్మికులు సీల్దా, హౌరా స్టేషన్లనుండి బయలుదేరారు. రక్షణశాఖ ఉద్యోగులు మధ్యలో వర్షం పడుతున్నప్పటికీ లెక్క చేయకుండా కలకత్తాకు ఉత్తర కొసలోని కాస్సిపూర్ నుండి మైదానానికి వచ్చారు.

ఈ సభకు అఖిలభారత రక్షణశాఖ ఉద్యోగుల సంఘ ఉపాధ్యక్షుడు శ్రీ శరత్ సేన్ అధ్యక్షత వహించారు. వివిధ ట్రేడ్‌యూనియన్ సంస్థల ప్రతినిధులు ప్రసంగించారు.

మొదటి వేతనాల కమిషన్ ప్రాతిపదికపై అధికధరలఅలవెన్సు చెల్లించాలని, ట్రేడ్‌యూనియన్ ప్రతినిధులు, ప్రభుత్వశాఖలు, సంస్థలలో శాశ్వత స్టాండింగ్ కమిటీలను నియమించాలనీ, ప్రస్తుతం ఉన్న సౌకర్యాలలో కోత పెట్టరాదనీ, రెండవ వేతన కమిషన్ వచ్చిన తరువాత పోయిన సౌకర్యాలను తిరిగి ఇవ్వాలనీ వీరు కోరుతున్నారు.

అలహాబాదులో

అలహాబాద్‌లో సుమారు నాల్గువేల మంది కేంద్ర ప్రభుత్వఉద్యోగులు నేడు కోర్కెలదినం జరిపారు. ఇందులో ఎకౌంటెంటు జనరల్ ఆఫీసు, రైల్వే, పౌర విమానయానం, తంతి - తపాలా శాఖలకు చెందిన ఉద్యోగులున్నారు. వీరు తమతమ కార్యాలయాల ఆవరణల్లో సమావేశాలు జరిపి కేంద్ర ప్రభుత్వం తమ కోర్కెలను అంగీకరించవలసిందిగా కోరుతూ తీర్మానాలు చేశారు.

విజయవాడలో

కేంద్ర ప్రభుత్వోద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు ననుసరించి దక్షిణ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన విజయవాడలో నేడు కేంద్ర ప్రభుత్వోద్యోగుల కోర్కెలదినం జరిగింది. ఉద్యోగస్తులు ముఖ్యమైన కోర్కెలతో ఉన్న బ్యాడ్జీలను ధరించారు. సాయంత్రం హనుమంతరాయ గ్రంథాలయములో యూనియన్ బ్రాంచి కార్యదర్శి శ్రీ మోజెస్ గారి అధ్యక్షతను సభ జరిగింది. యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ సి. హెచ్. శివరామశర్మ గారు కోర్కెలను వివరించారు. కరువు భత్యము మొదటి పే కమీషన్ సిఫార్సుల ప్రకారం చెల్లించాలనీ, 15 వ కార్మిక మహాసభల నిర్ణయానుసారం కనీసవేతనం నిర్ణయించబడాలనీ ప్రస్తుతము అనుభవిస్తున్న సౌకర్యాలను తగ్గించరాదని, సర్వీసు నిబంధనలను నిర్ణయించుటకు శాశ్వత వేతన బోర్డును నియమించాలని కోరారు. కారణంలేకుండా ఉద్యోగులను పని నుండి తొలగించరాదనీ, ఎన్నికలలో అధిక సంఖ్యాకుల ఆమోదాన్ని పొందిన కార్మిక సంఘాలను గుర్తించాలని అన్నారు. రైల్వేమెన్స్ ఫెడరేషన్ ప్రతినిధులు రైల్వే మంత్రితో సంప్రదింపులు జరిపితే అవి ఫలించలేదని తెలియజేశారు. ఈ సందర్భంలో ఆర్థిక మంత్రి అవలంబించిన కార్మిక వ్యతిరేక వైఖరిని ఖండించారు.

తర్వాత శ్రీయుతులు పి. శ్రీరాములు, యం. వి. సుబ్బారావు, పోస్టలు ఉద్యోగుల కార్యదర్శి శ్రీ బి. టి. సింగ్ గార్లు వివిధ సమస్యలపై మాట్లాడారు.

తర్వాత ఈ క్రింది తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదింపబడినవి.

“దక్షిణ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యమున జరిగిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగస్తుల సమావేశము, ఇటీవల బొంబాయిలో జరిగిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమావేశములో రూపొందించబడిన కోర్కెలను బలపరుస్తున్నది.

కేంద్ర ఆర్థిక మంత్రి కార్మికసంఘాలతో సంప్రదింపులు జరుపవలసిన అవసరంలేదని వాదించడం ప్రజాస్వామిక విధానాలద్వారా సమస్యలను పరిష్కరించు కోవాలనే సూత్రాన్ని తిరస్కరించడమేనని ఈ సమావేశము భావిస్తుంది. కేంద్ర రైల్వే మంత్రి అఖిలభారత రైల్వే మెన్స్ ఫెడరేషన్ ప్రతినిధులను కలుసుకొని మాట్లాడినప్పటికీ ప్రధానమైన కోర్కెలను ఆమోదించలేదు ఇలాంటి పరిస్థితులలో భారత ప్రధాని స్వయాన కల్పించుకొని కేంద్ర ప్రభుత్వోద్యోగుల ఐక్యకార్యాచరణ ప్రతినిధులతో సమావేశమయి జాతీయ ప్రయోజనాల దృష్ట్యా, ఉద్యోగులకు ప్రభుత్వానికి మధ్య సుహృద్భావ సంబంధాలను నెలకొల్పడానికి, సమస్యలు పరిష్కరించి తద్వారా కేంద్ర ప్రభుత్వోద్యోగులందరూ సంకల్పించిన సమ్మెను విరమింపజేయాలని విజ్ఞప్తి చేస్తుంది.

ఇదేవిధంగా ఎర్నాకుళం, మధుర, ఆగ్రా, కటక్ మొదలగు పట్టణాల్లో సభలు, ఊరేగింపులు జరిగినట్లు వార్తలందాయి.

29 న సంయుక్త కార్యాచరణ సమితి సమావేశం

బొంబాయి, మే 25

వివిధ శాఖలలోని 22 లక్షలమంది కేంద్ర ప్రభుత్వోద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర ప్రభుత్వోద్యోగుల కార్యాచరణ సమితి ఈ నెల 29 న బొంబాయిలో సమావేశమై, తమ కోర్కెలను సాధించుకోవడానికి తాము అవలంబించవలసిన ప్రత్యక్ష చర్యలనుగూర్చి చర్చిస్తుంది.

సమితి అధ్యక్షులు శ్రీ దార్వే నేడిక్కడ జరిగిన కేంద్ర ప్రభుత్వోద్యోగుల సభలో ప్రసంగిస్తూ పై విషయము వెల్లడించారు.

మూడువందల మంది అకాలీల అరెస్టు

అమృతసర్, మే 25

పంజాబు రాష్ట్రమంతటా సుమారు 300 మంది అకాలీదళ నాయకులను, కార్యకర్తలను అరెస్టుచేసినట్లు నేడిక్కడ అకాలీ కార్యాలయానికి వచ్చిన వార్తలవలన తెలుస్తూంది.

మొత్తం అరెస్టులు నాల్గువందలవరకు పెరగవచ్చునని విశాలాంధ్ర విలేకరి న్యూఢిల్లీనుండి తెలియజేస్తున్నారు.

హిందూ మతతత్వ వాదులు పంజాబు విభజనకు వ్యతిరేకంగా ఈ నెలలోనే జరుపనున్న సభపైకూడా ప్రభుత్వం ఆంక్షలు విధించదలచినట్లు తెలుస్తూంది.

అకాలీదళ నాయకుని ప్రకటన

అకాలీదళ ప్రతినిధి ఒకరు విశాలాంధ్రవిలేకరితో మాట్లాడుతూ తాము శాంతియుతంగా మాత్రమే ప్రదర్శనలు జరుపదలచినట్లు తెలియజేశారు. గాని ఈ ఆందోళన యాత్ర జరిపే ఉద్దేశ్యం లేదన్నారు. పంజాబు ప్రభుత్వం తీసుకున్న ఈచర్య వూహించరానిదనీ, దీనికి ప్రతికూలంగానే శాంతియుత ఉద్యమాన్ని లేవదీయ దలిచామనీ అన్నారు

కొందరి అజ్ఞాతవాసం?

అకాలీ నాయకులలో కొందరు ముఖ్యులు అజ్ఞాతవాసంలోకి వెళ్ళినట్టు తెలుస్తోంది. ఈ సమస్యకు ఒక రాజీ పరిష్కారం కుదుర్చుదామని మధ్యమార్గంలో ఉన్న కొందరు తలపోస్తున్నారు. కాని ఇప్పుడు నిస్సహాయ స్థితిలో పడ్డారు.

అంబాలాలో

అంబాలా, మే 25

గతరాత్రి యిక్కడ16 మంది అకాలీదళ నాయకులను అరెస్టు చేశారు. అంబాలా సిటీ, అంబాలా కాంటోన్మెంటు, రూపార్, జగధారి మొదలైన ప్రాంతాలపై ఒకేసారి దాడి చేశారు.

అమెరికా విమానం అప్పగింత

సోవియట్ అధికారులచే

బెర్లిన్, మే 24

అమెరికా వైమానికదళానికి చెందిన దకోటా విమానం అందులోని 9 మంది ప్రయాణీకులను నేడు సోవియట్ వారు అమెరికా సైనిక ప్రతినిధివర్గానికి అప్పచెప్పారు. ఈ విమానం తూర్పు జర్మనీ సరిహద్దును ఉల్లంఘించవచ్చినందువల్ల సోవియట్ యుద్ధవిమానాలు దీన్ని క్రిందికి దింపివేసిన విషయం పాఠకులకు విదితమే.

పాట్స్‌డాంలోని అమెరికా సైనిక దళబృందం ఈ విమానాన్ని సోవియట్ అధికారులనుండి స్వాధీనపరచుకొన్నదని అమెరికా సైనిక ప్రతినిధి నేడు ప్రకటించారు.

గూఢచారి విమానం: కెన్నడీ వైఖరి

న్యూయార్క్, మే 24

తానే గనుక ఐసెన్‌హోవర్ స్థానంలో ఉండి ఉన్నట్లయితే, అమెరికా ‘యు-2’ గూఢచారి విమానం విషయమై కృశ్చేవ్‌కి తన విచారాన్ని తెలుపుకొని ఉండేవాడినని డెమొక్రటిక్ పార్టీ సెనెటర్ జాన్ కెన్నడీ ఈవేళ అన్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఈయన డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయబోతున్నారు. ఈమాటలనేఆయన ఇదివరకొకసారి అన్నారు. నేడొక టెలివిజన్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, కృశ్చేవ్ ఖచ్చితంగా క్షమార్పణలను కోరలేదనీ, విచారంతెలిపితే సరిపోయేదనీ ఆయన అన్నారు. అలా జరిగిన తరువాతకూడా శిఖరాగ్ర సమావేశం విఫలమయితే, అప్పుడు నేరమంతా కృశ్చేవ్‌పై పెట్టడానికి అవకాశం ఉండేదన్నారు.

“అమెరికా ‘యు-2’ గూఢచారి విమాన ఉదంతానికి నేను నిజంగా విచారిస్తున్నాన”ని ఆయన అన్నారు.

* * *

మద్రాసులోని అయినవరం పోలీసు స్టేషన్ వద్ద గుమిగూడిన జన సమూహాన్ని చెదరగొట్టడానికి బుధవారంనాడు పోలీసులు లాఠీఛార్జి చేయగా ముగ్గురు గాయపడ్డారు.

చిలీ ఉపద్రవంవల్ల 3,700 మంది అదృశ్యం

శాంటియాగో, (చిలీ) మే 25

చిలీ భూకంపంతో పసిఫిక్ సముద్రంలో పుట్టిన ఉప్పెన, అగ్నిపర్వతాలు బ్రద్దలైన ఫలితంగా మరణించిన వారుగాని, జాడ తెలియనివారి సంఖ్యగాని మొత్తం 3,700 మంది వుంటారని అంచనా.

చాంగ్ ముఠాకు అమెరికా అదనపు యుద్ధ నావలు

తైపే, మే 24

తైవాన్‌లోని కొమింటాంగ్ ముఠాకు అమెరికావారు మరికొన్ని అదనపు యుద్ధనౌకలను సప్లయి చేయబోతున్నారని ఆ ముఠా నౌకా పర్యవేక్షణ తెలిపారు. సేనల్ని తీసుకుపోయి శత్రుభూభాగంమీద దింపే నావలను కొన్నిటిని కూడా సప్లయి చేస్తారట.

అమెరికానుండి కొత్త ‘సైనిక సహాయకోద్యోగి’ డొనాల్డ్ ఇర్విన్ తైవాన్ చేరుకున్నారు

* * *

బీహార్ రాష్ట్రంలోని సాహిబ్‌గంజిలో సాయుధ బందిపోటు దొంగలతో మంగళవారంనాడు జరిగిన ఘర్షణలలో నలుగురు గాయపడ్డారు.

COTTGE IDUSTRY

Latest Cottage Industry book consists of complete description of Various small scale profitable industries with sources of machineries and raw material price Rs. eight, postage Rs. 1. Cottage Industry (V. W - 145) post box 1262 Angoori Bagh, Delhi.

WANTED

Typists for an established concern. Only candidates with Intermediate standard Preferably with Sciences Group and Higher Typing Standards need apply. Previous experience, if any, will count. Apply stating minimum salary required to Box No. 83 Visalandhra Vijayawada - 2.

వరిపండే భూమి కావలెను

బందరు సమీపంలో అయితే మంచిది. లేదా బందరు గుడ్లవల్లేరుల మధ్యగాని సుమారు 1½ లేక 2 ఎకరముల వరిపండే మాగాని భూమి కొనుటకు కావలెను. ఈ క్రింది వారికి తెలియజేయండి.

బాక్సు నెం. 84, C/o విశాలాంధ్ర
విజయవాడ — 2.

డాక్టర్ డిగ్రీ పొందండి!

ఇంటిలో తీరికగా చదివి వుండేప్పుడు పోస్టల్ ట్యూషన్ పొంది, ప్రభుత్వ రిజిష్టరైన్ పొందిన కాలేజిద్వారా మీరు డిప్లొమా పొందవచ్చును. ఉచితప్రాస్పెక్టస్ వ్రాయండి.

Indian Homeopathic College
(vav) JULLUNDUR CITY


అన్నపూర్ణా!
నా చిననాటి కలలు నిజమయ్యేలాగా నా జీవితానికి పసుపు బొట్లు పెడ్తూ కనిపించావు నన్ను వలచావు-వలపించావు. ఆశా సౌధాలు కట్టించి ఆకాశానికెత్తేశావు. నీవు వంచకివని ఇప్పుడర్థమయింది. నీది నీచ బుద్ధి. నిన్ను నమ్మి మనసివ్వటం నాదే బుద్ధి తక్కువ.
ఇట్లు ఆనంద్
ఈ ప్రణయ జీవుల గాథ
జగపతి వారి అన్నపూర్ణలో
చూడండి!

తృతీయ ప్రణాళికలో హయ్యర్ సెకండరీ స్కూళ్లు

అఖిల భారత సెకండరీ విద్యా సమితి సమావేశ నిర్ణయాలు

న్యూఢిల్లీ, మే 25

తృతీయ ప్రణాళికా కాలంలో అన్ని సెకండరీ స్కూళ్ళను హయ్యర్ సెకండరీస్కూళ్ళుగా మార్చాలని అఖిల భారత సెకండరీ విద్యాసమితి నేడిక్కడ నిర్ణయించింది.

సమితి సమావేశం నేటితో ముగిసింది. హయ్యర్ సెకండరీ స్కూళ్లుగా మార్చడానికి ఎంత డబ్బు అవుతుందో పరిశీలించవలసిందిగా సమితి సూచించింది. సమావేశానికి సమితిఅధ్యక్షుడూ, కేంద్ర విద్యాశాఖ సంయుక్త కార్యదర్శి అయిన పి. ఎన్. కృపాల్ అధ్యక్షత వహించారు.

సెకండరీ స్కూళ్ళను, హయ్యర్ సెకండరీ స్కూళ్ళగా మార్చకపోతే సెకండరీ విద్యాసంస్కరణకు ఎంతో దెబ్బతగులుతుందని సభ్యులు అభిప్రాయాలు వెల్లడించారు. ఒకవేళ అన్ని హైస్కూళ్ళను మార్చలేకపోతే కనీసం నూటికి 50 వంతుల స్కూళ్ళనైనా మార్చాలని వీరు సూచించారు. సమావేశంలో ఈ దిగువ నిర్ణయాలు చేశారు.

ఉపాధ్యాయుల కొరత

శిక్షణపొందిన ఉపాధ్యాయుల కొరత నేడు ఎక్కువగా ఉంది. అందుచేత గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయులకు హయ్యర్ సెకండరీస్కూళ్లలో విద్యాబోధ చేయడానికి తగినశిక్షణయివ్వాలి స్వల్పకాల శిక్షణ తరగతులు, రెండేళ్ళ డిప్లమా తరగతులు నడపాలి.

శాస్త్రీయ విజ్ఞానంపట్ల శ్రద్ధాసక్తులను కల్గించడంకోసం ప్రతిసంవత్సరం డిసెంబరు 1 వ తేదీ జాతీయ శాస్త్రీయ విజ్ఞాన దినోత్సవం జరపాలి. డిసెంబరు 1 వ తేదీతో ప్రారంభించి ఒక వారంరోజులపాటు సైన్సువారోత్సవం జరపాలి. ఆవారంలో సైన్సు ప్రదర్శనము దేశమంతటా జరపాలి ఉత్తమ ప్రదర్శన వస్తువులను తయారు చేసినవారికి బహుమతులు యివ్వడానికి కేంద్రప్రభుత్వం గ్రాంటులు యివ్వాలి.

ఎన్ని హైస్కూళ్ళలో వీలైతే అన్ని హైస్కూళ్లలో సైన్సు విద్య ప్రవేశపెట్టాలి.

సైన్సుక్లబ్ ఉద్యమాన్ని అభివృద్ధి చేయడానికి రాష్ట్ర విద్యాశాఖ తగుచర్య తీసుకోవాలి ప్రతి హైస్కూలులోను సైన్సుక్లబ్‌ను స్థాపించడానికి యత్నించాలి. ఈ క్లబ్‌లన్నీ కలిపి జిల్లా, ప్రాంత, రాష్ట్ర సంఘాలుగా నిర్మించి అఖిలభారత ఫెడరేషను ఏర్పరచాలి

సైన్సుక్లబ్ ఉద్యమంతో వాణిజ్యం, పరిశ్రమలపట్ల ఎక్కువ ఆసక్తి కల్గేటట్లు చూడాలి. ఇందుకు అవసరమైన అధికార యంత్రాంగాన్ని ఏర్పరచాలి.

స్త్రీల విద్య

స్త్రీల, బాలికల విద్య చాలా వెనుకబడి ఉన్నది. అభివృద్ధి కార్యక్రమాలకు కావలసిన స్త్రీ ఉద్యోగుల కొరత ఎక్కువగా ఉంటూంది. కనుక స్త్రీల విద్యాభివృద్ధికి తృతీయ ప్రణాళికా కాలంలో ప్రత్యేక కార్యక్రమం ప్రవేశపెట్టాలన్న నిబంధనను యథాతథంగా ఉంచాలి. స్త్రీ విద్యా జాతీయ సమితి సిఫారసుల ప్రకారం చేయాలి. ఒకవేళ మొత్తం ప్రణాళికలో ఏదైనా కోతపెట్టవలసివస్తే కూడా కొంత మాత్రమే చేయాలి.

కుటుంబనియంత్రణపట్ల బీదలకే హెచ్చు శ్రద్ధా?

హైదరాబాదు, మే 25

కుటుంబ నియంత్రణపట్ల బీదలకు, వెనుకబడినవారికే ఎక్కువ శ్రద్ధ వున్నట్లు రాష్ట్రంలోని వివిధ కుటుంబ నియంత్రణ కేంద్రాలనుండి వచ్చిన నివేదికలనుబట్టి అనుకోవలసివుంది.

ఉదాహరణకు 1959 లో చిత్తూరు కేంద్రంలో 85 వేలమంది కుటుంబ నియంత్రణ విషయమై సలహా పొందడానికి వచ్చారు. బీద ప్రజలున్న ప్రాంతంలోని హైదరాబాదు యునానీ ఆసుపత్రికి ఈ సలహాకై వచ్చినవారి సంఖ్య 11918 ఇదే సంవత్సరం ఐతే గుంటూరు కేంద్రానికి 2 వేలమంది, కాకినాడ కేంద్రానికి వేయిమందిమాత్రమే సలహా పొందారు.





సంపాదకవర్గం : మోటూరు హనుమంతరావు (అధ్యక్షుడు), కాట్రగడ్డ రాజగోపాలరావు, ఏటుకూరు బలరామమూర్తి, విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరఫున ఎడిటర్, ప్రింటర్ అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర అప్ప ప్రింటర్సు, విజయవాడ - 2.